

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL  ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి  గురువారం 20 మే 2021  సంపుటి : 02  సంచిక :307  పేజీలు : 4  వెల : రూ 3-00

## దేశం మొత్తం ఏపీ వైపే చూడటం అంటే ఇదేనా?: దేవినేని ఉమ

అమరావతి: తిరుపతి ఉపఎన్నిక కోసం మార్చిలో బడ్జెట్ వాయిదా పడిందని... 2ఏళ్లు డిమాండ్లపై చర్చలేకుండా లక్షల కోట్లు ఖర్చు పెట్టారని మాజీ మంత్రి దేవినేని ఉమ పేర్కొన్నారు. "తిరుపతి ఉపఎన్నిక కోసం మార్చిలో బడ్జెట్ వాయిదా 2 ఏళ్లు డిమాండ్లపై చర్చ లేకుండా లక్షల కోట్లు ఖర్చు పెట్టారు. మొక్కుబడి తంతుగా ఒక్కరోజు బడ్జెట్ దేశం మొత్తం ఏపీ వైపే చూడటం అంటే ఇదేనా? కరోనా కష్ట సమయాల్లో బడ్జెట్ సమావేశాలు ఎందుకు పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందో ప్రజలకు సమాధానం చెప్పండి? వైఎస్ జగన్‌వవ అని దేవినేని ఉమ పేర్కొన్నారు.

## సిటీస్కాన్, ఎంఆర్ఐ మిషన్లను ప్రారంభించిన సీఎం జగన్

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం సిటీస్కాన్, ఎంఆర్ఐ మిషన్లను ప్రారంభించారు. నెల్లూరు, కడప, ఒంగోలు, శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రుల్లో సిటీస్కాన్, ఎంఆర్ఐ మిషన్లను సీఎం జగన్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. ప్రభుత్వాస్పత్రులను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. పేదవాడికి మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రంలో 11 టీచింగ్ ఆస్పత్రులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మరో 16 టీచింగ్ ఆస్పత్రులను అందుబాటులోకి తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. వీటన్నింటినీ ఆరోగ్యశ్రీ కిందకు తీసుకొస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే..:'ఈరోజు రాష్ట్రంలో 11 టీచింగ్ ఆస్పత్రులలో కేవలం ఏడింటిలో మాత్రమే సీటీ స్కాన్, ఎంఆర్ఐ పరికరాలు ఉన్నాయి. అవి కూడా పీపీపీ పద్ధతిలో ఉ



న్నాయి. వాటిలో టెక్నాలజీ, క్వాలిటీ అప్‌గ్రేడేషన్ కూడా లేదు. ఈ పరిస్థితి మారాలని పలు చర్యలు తీసుకుంటున్నాము. కొత్తగా 16 టీచింగ్ ఆస్పత్రులు ఏర్పాటు చేస్తున్నాము. ఇప్పటికే ఉన్న 11 టీచింగ్ ఆస్పత్రులను నాడు-నేడు కింద అప్‌గ్రేడ్ చేయడంతో పాటు, కొత్తగా ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో కొత్తగా టీచింగ్ ఆస్పత్రితో పాటు, నర్సింగ్ కాలేజీ కూడా ఏర్పాటు చేస్తున్నాము. వాటిలో టాప్ ఆఫ్ ది లైన్ డయాగ్నస్టిక్ సర్వీసులు అందించే దృక్పథంతో అడుగులు వేస్తున్నాము'టీచింగ్ ఆస్పత్రులలో ఆ సదుపాయాలన్నింటినీ ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకువచ్చి, పథకం లబ్ధిదారులకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తాము. ఆ విధంగా డయాగ్నస్టిక్ సేవలు అందిస్తాము. మరోవైపు ఆరోగ్యశ్రీ ట్రస్టు వాటి నిర్వహణ వ్యయం భరిస్తుంది. ఆ విధంగా రాబోయే రోజుల్లో అప్‌గ్రేడ్‌తో ఆ పరికరాలు, నిరంతరం బాగా పని చేసేలా చర్యలు చేపడుతున్నాము.'నాడు-నేడులో ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నాము. ఆస్పత్రులను జాతీయస్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నాము. ఇప్పుడు రూ.67 కోట్ల వ్యయంతో శ్రీకాకుళం, ఒంగోలు, నెల్లూరు, కడపలో సీటీ స్కాన్‌లు, కడప మినహా మూడు చోట్ల ఎంఆర్ఐ పరికరాలను కూడా ఏర్పాటు చేయడం జరిగింది. వీటికి మూడేళ్ల వారంటీ ఉంది. మరో ఏడేళ్లు సర్వీసు బాధ్యతను ఆ కంపెనీలు నిర్వహిస్తాయి. ఏ పేదవాడికైనా ఉచితంగా సేవలందించేలా, ప్రభుత్వ టీచింగ్ ఆస్పత్రులలో అన్ని సదుపాయాల ఏర్పాటు చేస్తాం'రాష్ట్రంలోని 11 టీచింగ్ ఆస్పత్రులలో నాలుగు చోట్ల సీటీ స్కాన్, ఎంఆర్ఐ పరికరాలు లేవు కాబట్టి ఇప్పుడు శ్రీకాకుళం, ఒంగోలు, నెల్లూరు, కడపలో ఏర్పాటు చేస్తున్నాము. మిగిలిన ఏడు చోట్ల ఆ సదుపాయాలు పిపిపి విధానంలో ఉన్నాయి. కాబట్టివాటిని ప్రభుత్వమే స్వయంగా ఏర్పాటు చేస్తుంది. ఇంకా కొత్తగా ఏర్పాటు చేసే 16 టీచింగ్ ఆస్పత్రులలో కూడా ఈ సదుపాయాలన్నీ కల్పిస్తాము'ఈ కోవిడ్ సంక్షోభంలో ప్రతి ఆస్పత్రిలో వైద్యులు, నర్సులు, శానిటేషన్ సిబ్బందితో పాటు, గ్రామ స్థాయిలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు. వలంటీర్లు పగలు రాత్రి కష్టపడుతున్నారు. ప్రజలకు సేవలందిస్తున్నారు. వీరి సేవల గురించి ఎంత పొగిడినా తక్కువే. కోవిడ్ సమయంలో ఎంతో మంచి సేవలందిస్తున్న మీ అందరికీ మా అభినందనలు'ఈ సందర్భంగా కలెక్టర్లు, జేసీలు, డీహెచ్ఎంఓలకు కొన్ని సూచనలు. ఫీవర్ సర్వే కొన్ని చోట్ల అనుకున్న విధంగా జరగలేదని కొందరు అధికారులు దిగువ స్థాయి సిబ్బందిపై చర్యలు తీసుకున్నారని నా దృష్టికి వచ్చింది. కరోనా మహమ్మారితో ప్రస్తుతం ప్రతి ఒక్కరూ ఎంతో ఒత్తిడిలో ఉన్నారని అందరూ గుర్తుంచుకోవాలి.

అందుకే అధికారులంతా మంచితనంతో తమ సిబ్బందితో పని చేయించుకోవాలని కోరుతున్నాను'మీ అందరికీ నా తరఫున ఒక విజ్ఞప్తి. ప్రతి ఒక్కరూ తీవ్ర ఒత్తిళ్లలో పని చేస్తున్నారు. కాబట్టి కింది వారికి నచ్చ చెప్పి పని చేయించుకోండి. ఆగ్రహిస్తే వచ్చేదేమీ లేదు. ఆస్పత్రుల్లో వైద్యులు, నర్సులు, వార్డుబాయ్స్, చివరకు శానిటేషన్ సిబ్బంది.. ఇలా ప్రతి ఒక్కరూ ఎంతో ఒత్తిడి మధ్య పని చేస్తున్నారు. నా దగ్గర నుంచి పారిశుద్ధ్య కార్మికుడి వరకు కోవిడ్ వల్ల ఎదురయ్యే అనూహ్య పరిస్థితులను ఎదుర్కనే ఒత్తిడిలో ఉన్నారు'ప్రతి రోజూ 20 వేల కోవిడ్ కేసులు నమోదవుతున్నాయి. నిజానికి అందరూ చాలా బాగా పని చేస్తున్నారు. అందుకే మన దగ్గర టయర్-1 సిటీ, ఆ స్థాయిలో ఆస్పత్రులు లేకపోయినా, దేశంలోని ఇతర రా(ష్ట్రాలతో పోలిస్తే ఇక్కడ మరణాల రేటు చాలా తక్కువగా ఉంది. మీరంతా ఆస్పత్రుల్లో బా ధ్యతను తీసుకోవడమే కాకుండా, ఎంత ఒత్తిడి ఉన్నా చిరునవ్వుతో పని చేస్తున్నారు కాబట్టే ఇది సా ధ్యమైంది. అదే విధంగా కోవిడ్‌ను కూడా ఎదుర్కోగలుగుతున్నాము. కాబట్టి ఎవ్వరూ సహనం కోల్పోవద్దు. అధికారులు మంచితనంతో పని చేయించుకోవాలని కోరుతున్నానువడ అని విజ్ఞప్తి చేసిన సీఎం జగన్ ఈ మంచి కార్యక్రమంతో ప్రజలకు ఇంకా మేలు జరగాలని మనసారా కోరుకుంటున్నానంటూ ప్రసంగం ముగించారు. సమావేశంలో డిప్యూటీ సీఎం, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని), విద్యా శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్, ఏపీఎంఎస్ఐడీసీ వీసీ అండ్ ఎండీ వి.విజయరామరాజు, ఆర్థిక శాఖ కార్యదర్శి ఎన్.గుల్జార్‌తో పాటు, వైద్య ఆరోగ్య శాఖకు చెందిన పలువురు అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రోజుకు 25లక్షల కొవిడ్ టెస్టులు లక్ష్యం : హర్షవర్ధన్




న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా రోజుకు 25లక్షల కొవిడ్ టెస్టులు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో దేశంలో 20లక్షల కుపైగా నమూనాలను మంగళవారం పరీక్షించినట్లు కేంద్రమంత్రి పేర్కొన్నారు. త్వరలోనే రోజు 25లక్షలు టెస్టులు చేస్తామని చెప్పారు. బుధవారం ఆరోగ్యశాఖ మంత్రి సఫ్దర్‌జంగ్ ఆసుప త్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అయితే, వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతున్నా గ్రామీణ ప్రాంతాల్లో పరీక్షలు లేకపోవడంతో కొత్త కేసుల్లో తగ్గుదల నమోదవుతుందని నిపుణులు హెచ్చరించారు. ఈ క్రమంలో రోజువారీ పరీక్షలు పెంచనున్నట్లు ప్రకటించారు. ఇదిలా ఉండగా.. గతేడాదిలో కరోనా దేశంలో పట్టణాల్లో ఎక్కువగా.. వ్యాప్తి చెందగా రెండోవేవ్‌లో భారీగా సోకుతోంది. గడిచిన వారం రోజులుగా దేశంలో పాజిటివ్ కేసులు తగ్గుముఖం పడుతుండగా.. బుధవారం కొత్త కేసులు 2,67,334 కేసులు నమోదయ్యాయి. వరుసగా మూడో రోజు మూడు లక్షల కంటే తక్కువగా కరోనా కేసులు నమోదయ్యాయి. 24 గంటల్లో 4,529 మంది వైరస్ బారినపడి మృత్యువాతపడ్డారు. నిన్న ఒకే రోజు 20,08,296 టెస్టులు చేసినట్లు ఐసీఎంఆర్ తెలిపింది. ఇప్పటి వరకు దేశంలో కరోనా 32,03,01,177 నమూనాలను పరీక్షించినట్లు వివరించింది.

## స్కూల్స్, అంగన్‌వాడీ కేంద్రాల్లో నాడు-నేడు పై సీఎం జగన్ సమీక్ష

ఒక్క స్కూల్ కూడా మూతపడకూడదు

పిల్లలకు 2 కి.మీ. దూరం లోపలే బడి ఉండాలి

విప్లవాత్మక మార్పుల్లో టీచర్ల పాత్ర కీలకం

అవసరమైన చోట అదనపు తరగతి గదులను నిర్మించండి: సీఎం జగన్

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రారంభించిన 'నాడు-నేడుc కార్యక్రమంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాభ్యాసంలో గట్టి పునాదులు వేయడం, ఎఫెక్టివ్ ఫౌండేషనల్ ఎడ్యుకేషన్ మార్గదర్శక ప్రణాళికపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అంగన్‌వాడీ ఉపాధ్యాయుల



కోసం రూపొందించిన స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకం, సీడీలను సీఎం జగన్ ఆవిష్కరించారు. అంగన్‌వాడీ అభివృద్ధి కమిటి శిక్షణ కోసం రూపొందించిన కరదీపిక నమూనాను అధికారులు సీఎంకు చూపించారు. అనంతరం సమీక్షలో... రాష్ట్రంలో 10 మంది పిల్లల కన్నా తక్కువగా ఉన్న స్కూళ్లు, అలాగే 30 మంది కన్నా పిల్లలు తక్కువగా ఉన్న స్కూళ్ల గురించి అధికారులు సీఎంకు తెలిపారు. కొన్నిచోట్ల పిల్లల సంఖ్య తక్కువ, టీచర్లు ఎక్కువ ఉన్న స్కూళ్లు కూడా ఉన్నాయని తెలిపారు. స్కూళ్లను సమర్థవంతంగా వినియోగించుకోవడానికి, టీచర్ల సేవలను సమర్థవంతంగా వాడుకోవడానికి జాతీయ మార్గదర్శకాల ప్రకారం అధికారులు కొన్ని ప్రతిపాదనలు చేశారు. విద్యాభ్యాసంలో గట్టి పునాదులకోసం ఈ నిర్ణయాలు ఉపయోగపడతాయని సీఎంకు తెలిపారు. స్కూళ్ల వారీగా అక్కడున్న విద్యార్థులు, టీచర్ల సంఖ్యను బట్టి మార్పులు చేస్తామని అధికారులు సీఎం జగన్‌కు తెలిపారు. పిల్లలు తక్కువుగా ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో అంగన్‌వాడీ పిల్లలను కలుపుకునేట్టుగా చేస్తామన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ప్రస్తుతం ఉన్న టీచర్లు వీరికి విద్యాబోధన చేస్తారన్న అధికారులు.. దీనివల్ల శిక్షితులైన ఉపాధ్యాయులు వారికి ప్రాథమిక దశ నుంచే మంచి బోధన ఇవ్వగలరని, అలాగే స్కూళ్లు కూడా సమర్థవంతంగా వినియోగపడతాయని తెలిపారు. అవకాశం ఉన్న చోట మూడో తరగతి నుంచి ఐదో తరగతి వరకూ కూడా హైస్కూల్ పరిధికి తీసుకురావాలని ప్రతిపాదన చేశారు. అవసరమైన చోట అప్పర్‌ప్రైమరీ స్కూళ్లను హైస్కూళ్లగా మారుస్తామని అధికారులు ప్రతిపాదించారుఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. "నాడు-నేడుతో స్కూళ్లు, అంగన్‌వాడీలు అభివృద్ధి అయ్యాయి. రాష్ట్రంలోని ప్రతి స్కూల్ వినియోగంలో ఉండాలి. కొత్తగా చేస్తున్న ప్రతిపాదనల వల్ల ఒక్క స్కూలు కూడా మూతపడే పరిస్థితి రాకూడదు. శిక్షితుడైన టీచర్ పీపీ-1, పీపీ-2 పిల్లలకూ అందుబాటులో ఉండడం ఈ ప్రతిపాదనల్లో ఒక సానుకూల అంశం. అధికారులు మరోసారి కూర్చొని చర్చించి మరింత మంచి ఆలోచనలు చేయాలి. ఈనెలలో మరోసారి దీనిపై సమీక్ష చేద్దాంవవ అని సీఎం జగన్ అన్నారు."ఆప్యాయతతో మన లక్ష్యాలను టీచర్లకు వివరించడం ద్వారా మంచి పని తీరు సాధించుకోగలం. అసహనం ఎప్పుడూ కూడా బయటకు రానివ్వకూడదు. మనం తీసుకుంటున్న విప్లవాత్మక మార్పుల్లో టీచర్ల పాత్ర కీలకం. వారిని ఆప్యాయతతో దగ్గరకు తీసుకోండి... మంచి పనితీరు రాబట్టుకోండివవ అని సీఎం జగన్ అధికారులకు సూచించారు."స్కూళ్ళ నిర్వహణ, టీచర్లని వినియోగించడంలో జాతీయ ప్రమాణాలను పాటించాలి. పిల్లల సంఖ్యకు తగినట్టుగా టీచర్లు ఉండాలి. పిల్లలకు 2 కి.మీ. దూరం లోపలే బడి ఉండాలి. ఇంతకన్నా ఎక్కువైతే పిల్లలకు భారం అవుతుంది. నాడు- నేడు కింద అన్నిరకాల స్కూళ్లు, అంగన్‌వాడీలను అభివృద్ధిచేస్తున్నాం.

## సగర సోదరులు, భవన నిర్మాణ కార్మికులకు భగీరథ జయంతి శుభాకాంక్షలు

నారా చంద్రబాబు నాయుడు



విజయవాడ భగీరథ జయంతి సందర్భంగా సగర సోదరులు, భవన నిర్మాణ కార్మికులకు చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. భగీరథుడు అంటే పట్టుదలకు మారుపేరు. అసాధ్యాలను సుసాధ్యం చేయడమే "భగీరథ ప్రయత్నంగా" చెబుతారు. కఠోర తపస్సు చేసి దివి నుంచి భువికి పవిత్ర గంగాజలాన్ని తీసుకొచ్చిన మహనీయుడు భగీరథుడు. భవన నిర్మాణ కార్మికుల కులదైవం భగీరథుడు. టిడిపి ప్రభుత్వ హయాంలో భగీరథ జయంతిని రాష్ట్ర వేడుకగా ఘనంగా నిర్వహించాం. కానీ వైసీపీ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులను, భగీరథుడిని నిర్లక్ష్యం చేస్తోంది. ఇసుక కొరత సృష్టించి వందలాది మంది కార్మికుల ప్రాణాలు బలి తీసుకున్నారు. వేలాది కుటుంబాలను రోడ్డున పడేశారని అన్నారు. భగీరథుడికి నివాళిగానే టీడీపీ హయాంలో రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని శరవేగంగా చేపట్టాం. 5ఏళ్లలో రూ.70వేల కోట్లు ప్రాజెక్టుల పూర్తి కోసమే ఖర్చు పెట్టాం. 23ప్రాజెక్టుల పనులు పూర్తి చేశాం. మొత్తం 69ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాం. పోలవరం ప్రాజెక్టు పనులు 72% పూర్తి చేశాం-రికార్డు వ్యవధిలో పట్టిసీమ పూర్తిచేశాం. కానీ వైసీపీ ప్రభుత్వం లో సాగునీటి ప్రాజెక్టుల పనులు ముందుకు సాగడం లేదు. పోలవరం సహా అన్ని ప్రాజెక్టను నిర్లక్ష్యం చేశారు. రివర్స్ టెండరింగ్ పేరుతో కమిషన్లు దండుకుంటు న్నారు తప్ప కర్షకులకు సాగునీరు ఇవ్వడం లేదు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను త్వరిగతిన పూర్తి చేయాలి, కోవిడ్ ద్వారా పనులు లేక ఇబ్బందులు పడుతున్న భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని అయన అన్నారు.

## వ్యాక్సిన్ తయారీకి మరిన్ని కంపెనీలకు అనుమతివ్వాలి : నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ : కరోనా మహమ్మారి నేపథ్యంలో వ్యాక్సిన్ ఉత్పత్తి పెంచేందుకు మరిన్ని ఫార్మా కంపెనీలకు అనుమతి ఇవ్వాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. వీడియోకాన్ఫరెన్స్ ద్వారా యూనివర్సిటీల వైస్‌ఛాన్స్‌లర్లతో జరిగిన వర్చువల్ సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వ్యాక్సిన్ డిమాండ్.. సరఫరా కంటే ఎక్కువగా ఉంటే సమస్య ఉత్పన్నమవుతుందని.. ఒక సంస్థకు బదులుగా.. మరో పది కంపెనీలు వ్యాక్సిన్ తయారీకి లైసెన్స్ ఇవ్వాలన్నారు. మొదట దేశంలో సరఫరా చేసిన తర్వాత.. మిగులు ఉంటే ఎగుమతి చేయవచ్చన్నారు. కేవలం 15-20 రోజుల్లోనే దీన్ని చేయవచ్చని పేర్కొన్నారు. ప్రతి రాష్ట్రంలో రెండు, మూడు ప్రయోగశాలలున్నాయని, కొవిడ్ -19 వ్యాక్సిన్లను ఉత్పత్తి చేయడానికి వారికి ఫార్ములా ఇవ్వాలన్నారు. ఆత్మనిర్భర్ భారత్‌ను తాము కోరుకుంటున్నామని, దేశంలోని అన్ని జిల్లాలూ మెడికల్ ఆక్సిజన్ విషయంలో స్వయం సమృద్ధి సాధించాలని అన్నారు. అయితే, ఇప్పటికీ ముడి సరుకు దిగుమతిపై భారత్ ఆధారపడుతుందని తెలిపారు. కరోనా మమమ్మారి కాలంలో ప్రజలు పాజిటివ్ ఆలోచనలు, ఆత్మస్థైర్యం కలిగి ఉండాలని కేంద్రమంత్రి సూచించారు. ఇదిలా ఉండగా.. భారత్ బయోటెక్, సీరం



ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సంస్థలు ప్రస్తుతం దేశంలో వ్యాక్సిన్లు తయారు చేస్తున్నాయి. ప్రస్తుతం టీకా డ్రైవ్‌లో మూడు వ్యాక్సిన్లకు అత్యవసర వినియోగం కింద అనుమతి ఇవ్వగా.. కొవాగ్జిన్, కొవిషీల్డ్, స్పుత్నిక్ వీ అందుబాటులోకి వచ్చాయి. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ త్వరలోనే స్పుత్నిక్ వీ వ్యాక్సిన్‌ను ఉత్పత్తి చేయనుంది. జనవరి 16న ప్రారంభమైన కొవిడ్ టీకా డ్రైవ్‌లో భాగంగా ఇప్పటి వరకు 18,58,09,302 డోసులు పంపిణీ చేసినట్లు కేంద్ర కుటుంబ, ఆరోగ్యమంత్రిత్వ శాఖ తెలిపింది.

## కూపన్లు జారీ చేసి ధాన్యాన్ని సేకరిస్తాం: కొడాలి నాని

విజయవాడ: కూపన్లు జారీ చేసి ధాన్యాన్ని సేకరిస్తామని మంత్రి కొడాలి నాని స్పష్టం చేశారు. బుధవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఆర్బీకేల ద్వారా ధాన్యం నమూనాలు పరిశీలించి.. రైతు కల్లం వద్దే ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. ధాన్యం అమ్మిన రైతుకు రసీదులో పొందుపరిచిన మొత్తాన్ని.. ఆన్ లైన్ ద్వారా రైతుల బ్యాంకు ఖాతాకు నగదు జమ చేస్తామన్నారు. ఏపీ ప్రభుత్వం చేపట్టిన కల్లం వద్ద ధాన్యం కొనుగోలు ప్రక్రియను.. తెలంగాణ సహా పలు రా(ష్ట్రాలు ఆదర్శంగా తీసుకున్నాయని మంత్రి కొడాలి నాని వ్యాఖ్యానించారు.

## 'అన్ని అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది

అమరావతి: కరోనా నిబంధనలు పాటిస్తూ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఏ అంశంపైనైనా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. సిగ్గుపడకుండా అబద్ధాలు చెప్పడంలో టీడీపీ అధినేత చంద్రబాబు దిట్ట అని విమర్శించారు. కరోనా కట్టడికి తీసుకుంటున్న చర్యలు చంద్రబాబుకు కనబడటం లేదా అని ప్రశ్నించారు. కాగా ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఈ నెల 20వ తేదీన సమావేశం కాబోతున్న విషయం విదితమేప్రతి నియోజకవర్గంలో కోవిడ్ కేర్ సెంటర్ ఏర్పాటు చేశామని శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆక్సిజన్ కొరత లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు డైరెక్షన్‌లోనే రఘురామకృష్ణరాజు పని చేస్తున్నారని విమర్శించారు. టీడీపీ నేతలు అరెస్ట్ అయినప్పుడు చేయని హడావుడి బాబు ఇప్పుడు చేస్తున్నారని మండిపడ్డారు. హైకోర్టు వేసిన కమిటీ రిపోర్ట్‌ను కూడా చంద్రబాబు తప్పుపడుతున్నారని శ్రీకాంత్‌రెడ్డి అన్నారు.

# సంపాదకీయం

గురువారం 20 మే 2021

## నాటో దళాల ఉపసంహారణ ప్రభావం భారత్ పై పడనుందా?

ఆఫ్ఘనిస్థాన్ నుంచి తమ దళాలను ఉపసంహరించాలన్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ నిర్ణయం చూశాక 'ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిందన్న' పాత తెలుగు సామెత గుర్తుకు రాక మానదు. బైడెన్ నిర్ణయం వల్ల ఎక్కువగా ప్రభావితమయ్యే దేశం ఏదైనా ఉందంటే అది ఒక్క భారత్ మాత్రమేనని నిస్సందేహంగా చెప్పవచ్చు. అమెరికా, నాటో (నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్) దళాల ఉపసంహరణ వల్ల అఫ్ఘాన్ కు వేల మైళ్ల దూరంలో ఉన్న ఆయా దేశాలకు వచ్చే ఇబ్బందేమీ లేదు. ప్రత్యేకంగా కలిగే నష్టమూ ఏమీ లేదు. దళాలు వైదొలగడం వల్ల మధ్య ఆసియా దేశమైన ఆఫ్గాన్ కు, దాని పొరుగున గల భారత్ కు కలిగే నష్టం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.దళాల వైదొలగాలన్న జో బైడెన్ నిర్ణయం నేపథ్యంలో అఫ్గాన్–అమెరికాలకు సంబంధించి ఒక్కసారి చరిత్రలోకి తొంగి చూడటం అవసరం. 2001 సెప్టెంబరు 11న అమెరికా ట్రేడింగ్ సెంటర్ పై అల్ ఖైదా ఉగ్రవాదులు దాడిచేశారు. దీనిని అవమానకరంగా, తీవ్రంగా తీసుకున్న నాటి అధ్యక్షుడు జార్జిబుష్ అల్ ఖైదా అంతానికి ప్రతిన బూనారు. ఉగ్రవాదాన్ని మట్టుబెట్టడం, అఫ్గాన్ ను ఉగ్రవాద రహిత దేశంగా తీర్చిదిదద్దం అప్పట్లో అమెరికా లక్ష్యం. ఇందులో భాగంగా అఫ్గాన్ కు బలగాలను పంపారు. ఈ లక్ష్యం పాక్షికంగానే నెరవేరింది. ఇప్పటికీ అఫ్గాన్ ఉగ్రవాద కేంద్రంగానే ఉంది. రేపు సెప్టెంబరు 11నాటికి అమెరికా దళాలు అఫ్గాన్ లో అడుగుపెట్టి 20ఏళ్లవుతుంది.అఫ్గాన్ లో జోక్యం చేసుకున్నాక అమెరికా తలబొప్పి కట్టింది. ఒక ట్రిలియన్ డాలర్లు ఖర్చయింది. వేల మంది అమెరికా సైనికులు బలయ్యారు. అయినప్పటికీ అక్కడ శాంతి ఎండమావిగానే మిగిలింది. ఈ నేపథ్యంలో అగ్రరాజ్యంలో ఆలోచన మొదలైంది. వీలైనంత త్వరగా అక్కడి నుంచి నిష్క్రమించాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గతఏడాది ఫిబ్రవరిలో దోహాలోఅమెరికా–తాలిబన్ల మధ్య ఒప్పందం కుదిరింది. ఇప్పుడు ఆ నిర్ణయం అమలు దిశగా జో బైడెన్ అడుగలు వేస్తున్నారు. అఫ్గాన్ లో రెండువేల మందికి పైగా అమెరికా సైనికులు ఉన్నారు. భారత్ కు అఫ్గాన్ పొరుగు దేశం. ఆ దేశంతో వంద కిలోమీటర్లకు పైగా సరిహద్దును భారత్ పంచుకుంటోంది. దీనిని డ్యూరండ్ రేఖ అని వ్యవహరిస్తారు. రెండు దేశాల మధ్య మొదటినుంచీ మంచి సంబంధాలే ఉన్నాయి. అనేక విషయాల్లో అఫ్గాన్ కు భారత్ అండగా ఉంది. వేల కోట్ల రూపాయల వ్యయంతో ఏకంగా పార్లమెంటు భవనాన్నినిర్మించి ఇచ్చింది. ఏపీలోని నెల్లూరు జిల్లాకు చెందిన శీనయ్య కంపెనీ దీనిని నిర్మించింది. ఈ పార్లమెంటు భవనాన్ని 2015 డిసెంబరులో ప్రధాని మోదీ ప్రారంభించారు. సాగునీటి, విద్యుత్ ప్రాజెక్టులు, మౌలిక వసతుల ప్రాజెక్టుల్లో కీలక పాత్ర పోషించింది. తద్వారా భారత్ అక్కడి ప్రజల మన్ననలు పొందింది. పదేళ్లపాటు అధ్యక్షుడిగా పనిచేసిన హమీద్ కర్జాయ్, ప్రస్తుత అధ్యక్షుడు అష్రఫ్ ఘనీ వివిధ సందర్భాల్లో భారత్ పాత్రను కొనియాడారు.పొరుగుదేశమైన పాకిస్థాన్ కు ఇది మింగుడు పడలేదు. దీంతో అక్కడ ఉగ్రవాదాన్ని పాకిస్థాన్ అదేపనిగా ప్రోత్సహిస్తోంది. ఉగ్రవాదులకు భారత్ వ్యతిరేక కతను నూరిపోస్తోంది. ప్రజా ప్రభుత్వాలు బలహీనపడటంతో వారుఆడింది ఆటగా, పాడింది పాటగా మారింది. దీంతో వారు భారత్ లో హింసకు పాల్పడుతున్నారు. 1999లో భారతీయ విమానాన్ని కాంద్ హార్ లో హైజాక్ చేశారు. దీంతో నాటి వాజపేయి సర్కారులోని విదేశాంగ మంత్రి జశ్వంత్ సింగ్ జైల్లో ఉన్న ఉగ్రవాదులను వెంటబెట్టుకుని తీసుకెళ్లి అప్పగించి విమానంలోని బందీలను విడిపించుకువచ్చారు. 2001లో ఏకంగా భారత్ పార్లమెంటు భవనంపైనే దాడికి తెగబడ్డారు. ఈ చేదు అనుభవాల నేపథ్యంలో అఫ్గాన్ నుంచి అమెరికా దళాలు వైదొలగితే ఆ దేశం ఉగ్రవాదులకు స్వర్గథామంగా మారే ప్రమాదం ఉంది. ఉగ్రవాదులు భారత్ పై పేట్రేగిపోయే అవకాశం ఉంది. జో బైడెన్ నిర్ణయం మారే అవకాశం లేనందున భారత్ మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

## ఒంటరైన రఘురామ..రామ

ఏలూరు, మే 19, (న్యూస్ పల్స్)ఎగిరితే పడక తప్పదు. తిరిగి నేలను ముద్దాడకా తప్పదు. తనకు తిరుగులేదని చెప్పుకునేవారంతా కూడా ఏదో సందర్భంలో నేలకు దిగినవారే. ఇపుడు వైసీపీ రెబెల్ ఎంపీ రఘురామ కృష్ణంరాజు విషయంలో అదే నిజమై రుజువై నిలుస్తోంది. గోదావరి జిల్లాల్లో క్షత్రియ సామాజిక వర్గం బలంగా ఉంటుంది. వ్యాపార రాజకీయ, సినీ రంగాల్లో వారు బాగానే రాణిస్తున్నారు. అలాంటి క్షత్రియ సామాజిక వర్గంలో ఇపుడు రెబెల్ ఎంపీకి మద్దతు కరవు అయింది. ఆయన అరెస్ట్ తరువాత ఏ ఒక్క బిగ్ షాట్ కూడా ఖండించడానికి ముందుకు రాకపోవడమే రాజు ది బలమా? వాపా? అన్నది తెలియచేస్తోంది అంటున్నారు.రఘురామ కృష్ణంరాజు రాజకీయాల్లో ఎంతటి నాయకుడో తెలియదు కానీ ఆయన ఎన్నిక అయింది మాత్రం ఫస్ట్ టైమ్ ఎంపీగా 2019లో మాత్రమే. అది కూడా వైసీపీ టికెట్ మీద, జగన్ బొమ్మ బొమ్మతోనే అంటున్నారు ఆయన సామాజికవర్గం నేతలు. ఇదే రఘురామ కృష్ణంరాజుకు అంత బలం ఉంటే 2014 ఎన్నికల్లో టీడీపీలో చేరినా ఎందుకు టికెట్ ఇవ్వలేదు అని ప్రశ్నిస్తున్నారు. జగన్ వేవ్ లో కూడా వైసీపీ ఎమ్మెల్యేల కంటే తక్కువ ఓట్లు రాజుకు వచ్చాయని గుర్తు చేస్తున్నారు. గెలిచాకా తానే వైసీపీలో సీనియర్ నేతను అని రఘురామ కృష్ణంరాజు భావించడం, అహంకరించడం వల్లనే సీన్ ఇంతదాకా వచ్చిందని అంటున్నారు.వైసీపీలో రఘురామ కృష్ణంరాజుకు ఇబ్బందులు ఏమైనా ఉంటే ఆ పార్టీ నుంచి తప్పుకుని గౌరవంగా బయటకు వచ్చేస్తే సొంత సామాజికవర్గంతో పాటు బయట కూడా మద్దతు దక్కేదని అంటున్నారు. అలా కాకుండా ఎంపీ సీటుని అతుక్కుపోయి గెలిపించిన పార్టీనే నిందిస్తే ఎవరు సపోర్టు గా ఉంటారు అన్న ప్రశ్న వస్తోంది. మరో వైపు చూస్తే ఆయన గోదావరి జిల్లాలో రాజకీయంగా స్ట్రాంగ్ లీడర్ ఏమీ కాదు. ఒక పార్టీని సవాల్ చేస్తే మరో పార్టీ అక్కున చేర్చుకునే పరిస్థితులు కూడా ఉండవు అంటున్నారు. ఇంతలా ఈ రోజు మద్దతు ఇస్తున్న టీడీపీ కూడా వచ్చే ఎన్నికల్లో రఘురామ కృష్ణంరాజుకి టికెట్ ఇస్తుందని కూడా ఎవరూ గట్టిగా చెప్పలేకపోతున్నారు.ఇపుడు సీన్ చూస్తే అదే అనిపిస్తోంది. వైఎస్సార్ ఆత్మ, రఘురామ కృష్ణంరాజు వియ్యంకుడు అయిన కేవీ రామచంద్రరావు వంటి వారు సైలెంట్ గానే ఉంటున్న పరిస్థితి. మరో వైపు కాంగ్రెస్ మాజీ ఎంపీలు, వైఎస్సార్ కి సన్నిహితంగా ఉన్న వారు కూడా రఘురామ కృష్ణంరాజు అరెస్ట్ మీద ఎలాంటి కామెంట్స్ చేయడం లేదు. దీనిని బట్టి చూస్తే విపక్షాల రాజకీయ క్రీడకు ఆయన ఒక ఆయుధంగా మారారు తప్ప నిజంగా ఆయన బలం ఏంటన్నది ప్రశ్నగానే ఉంది. సొంత ఇలాకాలో ఆయనకు మద్దతు లేకపోవడంతో జగన్ని విమర్శించి హీరో అవుదామనుకున్న రఘురామ కృష్ణంరాజుకి తత్వం బోధపడిందా అన్న వారే ఉన్నారు. చంద్రబాబు సహా విపక్షం మద్దతు ఉందనుకుని ఇక మీదట కూడా దూకుడుగా వెళ్తే ఆయనకే రాజకీయంగా చిక్కులు వస్తాయని అనే వారూ ఉన్నారు. మొత్తానికి రచ్చబండ ఢిల్లీలో రోజూ పెట్టి సెటైర్లు పేల్చే రాజు గారికి పల్లెటూర్లో రచ్చ బండ తీర్పు చేదుగానే ఉంటుందని అంటున్నారు.


## అనాధ శవాలకు అండగా యువత

విజయనగరం, మే 19, (న్యూస్ పల్స్)ప్రార్థించే పెదవుల కన్నా...సహాయం చేసే చేతులు మిన్న అన్న నానుడి విజయనగరం ఫెస్ బుక్ యూత్ అడ్మిన్స్ సొంతం చేసుకుంటున్నారు.కోవిడ్ విపత్కర సమయంలో మేము సైతం అంటూ ఫేస్ బుక్ సందేశంతో ఆపన్న హస్తం అందిస్తున్నారు.దీంతో వివిధ ఆసుపత్రుల్లో కోవిడ్ తో మృతి చెందిన వారి బంధువులు సమాచారంతో కోవిడ్ డెడ్ బాడీలను స్మశాన వాటికలకు తరలించి దగ్గరుండి అంత్యక్రియలు జరిపిస్తూ....తమ ఔదార్యాన్ని చాటుకుంటూ...పదిమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు.సార్...మా బంధువులు చనిపోయారు హాస్పిటల్ లో సిబ్బంది ఎవరూ మృత దేహాన్ని శ్మశానానికి తీసుకుని వెళ్లడానికి ఎవరూ రావడం లేదు.మాకేమైనా సహాయం చేయగలరా...? ప్లీజ్...ప్లీజ్...అంటూ విజయనగరం యూత్ సభ్యులకు ఫోన్...మీరెవరు..!అది ఏ ఆసుపత్రి అంటూ బాధితులకు ధైర్యం చెప్తూ....అసోసియేషన్ సభ్యులు వెంటనే వచ్చి ఆ శవాన్ని అంబులెన్స్ లో శ్మశానానికి తీసుకెళ్లి హిందు సాంప్రదాయం ప్రకారం అంత్యక్రియలను నిర్వహించడం వారి రోజువారీ అలవాటుగా మారింది.ప్రస్తుత పరిస్థితుల్లో సహాయం చేసే మనుషులున్నా,సాయం చేయాలనే మనసున్నా కరోనాకి భయపడి అయినవాళ్లు కూడా కోవిడ్ బాధితుల దగ్గరకు రాలేకపోతున్నారు.ఐతే కోవిడ్ రోగులతో పాటు కోవిడ్ తో మృతిచెందిన వారిని,ఆర్థిక స్తోమత లేని వారు,అనాధ మృతదేహాలను తమ సొంత ఖర్చులతో స్మశాన వాటికకు తరలించి అంత్యక్రియలు నిర్వహించి ప్రస్తుతం కోవిడ్ వారియర్స్ గా అందరి దగ్గర మన్ననలు పొంది పదిమందికి ఆదర్శంగా నిలుస్తుండటం విశేషం.విజయనగరం జిల్లా డెంకాడ పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా విధులు నిర్వర్తిస్తున్న షేక్ ఇల్తామస్ మరొకరు శివ.శివకు ఓ సొంత అంబులెన్స్ ఉండటంతో కోవిడ్ రోగులతో పాటు డెడ్ బాడీలను తరలించడానికి వారి వద్ద నుంచి పైసా డబ్బులు ఆశించకుండా ఉచితంగా సేవాలందించడం ప్రస్తుత పరిస్థితుల్లో చాలా గొప్ప విషయం.వీరిద్దరితో పాటుగా మరికొంత మంది సభ్యులు కలసి విజయనగరం ఫేస్ బుక్ గ్రూప్ ను క్రియేట్ చేసి కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలుస్తూ వస్తున్నారు.ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో వారికి ఆపన్న హస్తం అందించటంలో ముందుంటున్నారు.పది మందికి సేవ చేయాలనే తపన ప్రస్తుతం కరోనాతో మృతి చెందిన వారిపట్ల ఈ విజయనగరం యూత్ సభ్యుల సేవా గుణం కోవిడ్ బాధితుల కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తోంది.వారికి కావలసిన మందులు,ఆహారం,ఆసుపత్రి అవసరాలు, అంత్యక్రియలు ఇలా దేనికీ,కుటుంబ సభ్యులు కూడా ముందుకు రాకపోయినా మేమున్నామంటూ వారిని అక్కున చేర్చుకొని వారి కష్టాలను అర్థం చేసుకుని కోవిడ్ బాధితుల బంధువులకు అండగా నిలుస్తున్నారు.ఐతే తెలుగు రాష్ట్రాలలోని పలు స్వచ్ఛంధ సంస్థలు కరోనా రోగులకు, మృతులకు సేవలు అందిస్తున్నాయి.కానీ ఇల్తామస్,మరికొంతమంది స్నేహితులు రూపాయి డబ్బులు ఆశించ కుండా తమ సొంత కార్చులతో కోవిడ్ డెడ్ బాడీలను అంబులెన్స్ తో తరలించి అంత్యక్రియలు తామే స్వయంగా నిర్వహించడంతో కోవిడ్ బాధిత కుటుంబాలు విజయనగరం యూత్ సేవ పట్ల రుణపడి ఉంటామని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఐతే ముస్లిం కుటుంబానికి చెందిన షేక్ ఇల్తామస్ మొదట ముస్లిం కుటుంబాల్లో కోవిడ్ బాధితుల కోసం మాత్రమే కోవిడ్–19 జేఏసీ ఏర్పాటు చేశారు.ఐతే హాస్పిటల్స్ దగ్గరకు వెళ్లినపుడు అన్నీ మతాల వాళ్లూ బాధలు పడుతున్నారనే విషయం గమనించి మతం కంటే,మానవత్వమే ముఖ్యమని భావించిన యూత్ కులమతాలకు అతీతంగా అందరికీ సాయం చేయడం ప్రారంభించాలనే సదుద్దేశంతో సొంతంగా అంబులెన్స్ ద్వారా కోవిడ్ తో మృతి చెందిన డెడ్ బాడీలను తమ అంబులెన్సులో మృతదేహాన్ని ఉచితంగా తరలించడంతోపాటూ,వారి మత సాంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించి కోవిడ్ బాధితులకు కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు

## శవాలపై మాఫియా దందా

కాకినాడ, మే 19, (న్యూస్ పల్స్)తూర్పుగోదావరి జిల్లాలో రోజు రోజుకీ కరోనా విలయతాండవం ఆడుతుంది రాష్ట్రంలో అత్యధిక కేసులు జిల్లాలోనే నమోదవుతున్నాయి అధికార యంత్రాంగం ఎన్ని పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పిన దాఖలాలు అనేకం అయినప్పటికీ క్షేత్రస్థాయిలో వైరస్ వ్యాప్తిని అరికట్టడంలో అధికార యంత్రాంగం విఫలం అయిందని చెప్పవచ్చు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆక్సిజన్,బెడ్స్ కొరత వల్ల కరోనా పేషెంట్స్ పదులు సంఖ్యలో మృత్యువాత పడుతున్నారు ఇప్పటికైనా ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా చేతల్లో చేపట్టాలని రోగి బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పట్టపగలు దోపిడీకరోనా శవాలపై మాఫియా దందాదహనానికి ప్యాకేజీ పేరుతో 28వేలు వసూలు కరోనా మృతదేహం పేరుతో దోపిడి గగ్గోలు పెడుతున్న కరోనా మృతుల కుటుంబాలుజతల్లీ గోదారి సాక్షిగా కనులు దాటని కన్నీళ్లు సుడులు తిరుగుతున్నాయి.కరెన్సీ కట్టెలతో చితిమంటలు భగ్గుమంటున్నాయి...మానవత్వం నిలువెల్లా కాలిభూడిదైపోతున్నా...కాసులు కోసం రుద్రభూమిచుట్టూ రాబందులు తిరుగుతూనే ఉన్నాయి...ఆఖరి మజిలీలో చివరి పైసానిఎగరేసుకు పోతున్నాయి...కాఠిన్య కరోనా కంటే దయనీయంగామృతుల కుటుంబాల నుకైలాస భూమి పేరుతో నిలువుదోపిడి చేస్తున్న మానవమృగాల పైశాచికత్వంపై మరుభూమిలోకిఅడుగుపెట్టింది...ఆఖరి మజిలీలో ఆరడుగుల నేలపైవాలిన గెద్దల బండారాన్ని బయటపెట్టేందుకు మహాన్యూస్ ముందుకు వచ్చింది..కరోనా మానవత్వాన్ని మంటగలిపేసింది. నా అన్నవాళ్ళను దూరం చేసేసింది. కరోనా సోకగానే ఆ రోగిని మెడికల్ మాఫియా దోచుకు తింటుంటే చనిపోయిన తరువాత కూడా ఆ శవాన్ని మాఫియా రాబందుల్లా పీక్కు తింటుంది.కాకినాడలో కైలాస భూమి పేరుతో స్మశాన వాటికలో కరోనా దహన మాఫియా రాబందుల్లా పీక్కు తింటుంది.రోగి చనిపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న వారి వద్ద నుండి ఒక్కొక్క భౌతిక కాయం దహనానికి 28వేల రూపాయలు ముక్కుపిండి మరీ వసూలు చేయడంపై మహా న్యూస్ ఆపరేషన్ ద్వారా బయటపెట్టింది. కరోనా మృతదేహం దహనం చేయడానికి ఓ మాఫియా ఏర్పాటైంది.కాటి కాపరి దగ్గర నుండి వ్యాన్ డ్రైవర్,దళారులు కలిపి దహనం చేసేందుకు ఓ ప్యాకేజీ నిర్ణయించి అధిక మొత్తంలో డబ్బులు గుంజు తున్నారు. కైలాస భూమి నిర్వాహకులతో కలిపి ఈ ముఠా దందా చేస్తుంది.ఒక మృతదేహం దహనం చేసేందుకు 28వేల రూపాయాలు వసూలు చేస్తున్నారు. కాటికాపరి ఇతర సిబ్బందికి, కైలాస భూమి కోసం ఖర్చవుతుందని చెబుతున్నారు. ఇదే సాధారణ మరణాలతో వచ్చే దహన సంస్కారాలకు 3 వేల 500 రూపాయలు వసూలు చేస్తుండగా కరోనా మృతదేహాల దహనానికి 7 రెట్లు అధనంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. దాతలు ఇచ్చిన విరాళాలతో కార్పొరేషన్ నిధులతో కైలాసభూమి నిర్మాణం చేసి నిర్వహణ పేరుతో వ్యాపారం చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కరోనా మృతదేహాల దహన సంస్కారాలకు అధిక మొత్తం వసూలు చేస్తూ బాధిత కుటుంబాలను ఆర్థికంగా కృంగదీస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి స్మశాన వాటికలో దోపిడీ అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు

## కలకలలాడుతున్న ఎయిర్‌పోర్ట్స్, రెస్టారెంట్స్




లండన్ : బ్రిటన్‌లో లాక్‌డౌన్ ఎత్తివేయడంతో సాధారణ జన జీవనం ప్రారంభమైంది. ప్రజలు పెద్ద సంఖ్యలో పబ్‌లు, రెస్టారెంట్లకు వచ్చి ఎంజాయ్ చేశారు. విమానాశ్రాయాల్లో ట్రాఫిక్ పెరిగిపోయింది. దాదాపు ఐదు నెలల తర్వాత బ్రిటన్ మొత్తం లాక్‌డౌన్ ఎత్తివేశారు. 6.76 కోట్ల జనాభాతో ఉన్న బ్రిటన్‌లో చాలా బార్‌లు, పబ్బులు, రెస్టారెంట్లు, థియేటర్లు జనంతో నిండిపోయి కలకలలాడాయి. పెద్ద సంఖ్యలో ప్రజలు ఎంజాయ్ చేయడానికి వీధుల్లోకి వస్తున్నారు.మరోవైపు, పరిస్థితులు నార్మల్ లైఫ్‌కు రావడంతో చాలా మంది సెలవులను జరుపుకునే మూడ్‌లో ఉన్నారు. బ్రిటన్ లోని అత్యంత రద్దీ విమానాశ్రయమైన హీత్రో, గెట్విక్ జనంతో రద్దీగా ఉన్నాయి. ప్రజలు 8–10 గంటలు క్యూలలో నిలబడాల్సి వస్తున్నది. ఇన్నిరోజుల పాటు ఇంటి పట్టునే ఉండి అన్‌లాక్ చేయడంతో తమకు ఇష్టమైన ప్రాంతాల్లో కుటుంబంతో గడిపేందుకు ప్రజలు వెళ్తున్నారు. దాంతో అన్ని విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు కిక్కిరిసిపోయి కనిపిస్తున్నాయి. హీత్రో, గెట్‌విక్ విమానాశ్రయాల నుంచి 340 విమానాలు సోమవారం ప్రయాణించాయి. వీరిలో 9 రోమ్, 21 పారిస్, 26 న్యూయార్క్‌కు బయల్దేరాయి.ఇలా ఉండగా, అమెరికా, బ్రిటన్ దేశాల కోసం కొత్త రకం నిబంధనలు తీసుకొచ్చే ఆలోచనలో యురోపియన్ యూనియన్ దేశాలు ఉన్నాయి. వీరికి వ్యాక్సినేషన్ సర్టిఫికేట్, క్వారంటైన్, వైరస్ నెగెటివ్ రిపోర్ట్ వంటివి తప్పనిసరి కాదని ఈయూ స్పష్టం చేసే అవకాశాలు ఉన్నాయి. ఫలితంగా ఇంతకాలం మూసివేసిన వ్యాపారాలు జోరుగా సాగుతాయని ఈయూ భావిస్తున్నది.

## చిరు వ్యాపారులకు కొవిడ్ కష్టాలు

రాజమండ్రి, మే 19, (న్యూస్ పల్స్)రోనా కారణంగా చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు .. అసలే రెక్కాడితే గాని డొక్కాడని బ్రతుకులు వి తమవని. అయితే ఈ కరోనా ప్రభావంతో జీవించటం మరింత క్షతరంగా తయారయ్యిందని రాజమండ్రికి చెందిన చిరు వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు..అసలే అంత అంత మాత్రంగా సాగే తమ బతుకులు ఈ కరోనా రావటంతో చిన్నాభిన్నంగా తయారయ్యాని చిరు వ్యాపారులు అంటున్నారు.. తమ జీవనాదారం కోసం అప్పులు చేసి వ్యాపారాలు కొనసాగిస్తున్నామని, చేసిన వ్యాపారం అంగా అప్పులు తీర్చటానికే సరిపోయేదని, మగిలిన కొద్ది సొమ్ముతో కుటుంబాన్ని గడుపుకుంటూ వస్తున్నామన్నారు.. అయితే అకాస్మాత్తుగా విరుచుకుపడ్డ కరోనా బరిన పడి తమ బ్రతుకులు చిన్నాభిన్నమయ్యామని వాపోయారు.. ఇప్పుడు రాష్ట్రంలో కరోనా సంఖ్య పెరగటంతె ప్రభుత్వం పాక్షిక లాక్ డౌన్ ప్రకటించిందని, ఉదయం 6 గం నుండి 12 వరకూ మాత్రమే వ్యాపారాలు చేసుకునేందుకు అనుమతి ఇవ్వటంతో , ప్రజలు ఎవరూ బయటకి రాక , సరిగా అమ్మకాలు జరుగక తాము నష్టపోతున్నామని , 5000 రూపాయల సరుకు తెచ్చి అమ్మకానికి పెడితే 1000 రూపాయలు కూడా సంపాదించలేక పోతున్నామని ఆవేదన చెందారు.. తచ్చిన సరుకు అమ్ముడవక కాల్వల్లో , చెత్త కుప్పల్లో పారబోస్తున్నామని అన్నారు.. ఇటు వ్యాపారం చేస్తేగాని పొట్ట గడవని బ్రతులుని, కరోనాను కూడా లెక్క చేయకుండా కుటంబాన్ని పోషించటం కోసం అప్పులు చేసి వ్యాపారాలు చేస్తున్నా, డబ్బులు గిట్టుబాటు కాక అప్పులపాలయిపోతున్నామని తమ భాదను వ్యక్తం చేశారు.. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వం తమను ఆదుకోవాలని, తమకు తగు విధంగా సహాయం అందించి తమను కాపాడలని రాజమండ్రి చిరు వ్యాపారులు వేడుకుంటున్నారు.

## కాంగ్రెస్ వైపు సీనియర్లు చూపు

విజయవాడ, మే 19, (న్యూస్ పల్స్)ఒకప్పటి కాంగ్రెస్ నేతలు.. ఒకరకంగా చెప్పాలంటే.. వారంతా కురువృద్ధులు. అయితే.. ఇప్పుడు వివిధ పార్టీల్లో ఉన్నారు. రాష్ట్ర విభజనతో కాంగ్రెస్ కుదేలైన నేపథ్యంలో కొందరు?. తమ తమ వ్యాపార అవసరాల కోసం మరికొందరు..ఇలా ఎవరికి నచ్చిన మార్గంలో వారు ఇతర పార్టీలను ఆశ్రయించారు. కొందరు జాతీయ పార్టీలో ఉంటే.. మరికొందరు.. ప్రాంతీయ పార్టీలను సైతం ఆశ్రయించారు. ఇలాంటివారిలో రాయపాటి సాంబశివరావు, కావూరి సాంబశివరావు, కోట్ల సూర్య ప్రకాశ్‌రెడ్డి, జేసీ దివాకర్‌రెడ్డి ఇలా అనేక మంది ఇతర పార్టీల్లో ఉన్నారు. ఆయా పార్టీల్లో అయినా.. వీరికి ఆశించిన మేరకు న్యాయం జరిగిందా ? అంటే.. లేదు.కేవలం ప్రస్తుతం అధికారంలో ఉన్న వైసీపీలో ఉన్న వారిలో కొందరికి మాత్రమే న్యాయం జరిగింది. వీరిలో సీ రామచంద్రయ్య వంటివారు ఉన్నారు. మిగిలిన వారంతా కూడా ఎలాంటి గుర్తింపు లేకుండా మౌనంగా ఉన్నారు. అయితే.. ఇప్పుడు రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. రాష్ట్రంలోనూ.. దేశంలోనూ ప్రత్యామ్నాయ రాజకీయ శక్తులను ఆహ్వానించేందుకు ప్రజలు రెడీ అవుతున్నారు. ప్రధానంగా మోడీపై తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోంది. అదే సమయంలో ఏపీ విషయాన్ని తీసుకున్నా.. ఇక్కడ రెండు ప్రధాన ప్రాంతీయ పార్టీలూ.. కేంద్రం నుంచి తీసుకురావాల్సిన నిధులు, హక్కుల విషయంలో విఫలమయ్యాయి.ఈ క్రమంలో ఇప్పుడు ప్రజల్లో మళ్లీ కాంగ్రెస్ పేరు వినిపిస్తోందని కాంగ్రెస్ పాత కాపులు అంటున్నారు. వాస్తవానికి కాంగ్రెస్ కూడా ఇదే వ్యూహంతో ఉంది. గత ఎన్నికల సమయంలోనే పార్టీ.. పాత కాపులకు తిరిగి రావాలంటూ.. పిలుపునిచ్చింది. అయితే.. ఒక్కరు కూడా రాలేదు. దీంతో వేచి చూస్తోంది. రాజకీయ పరిణామాలు వాటంతట అవే మారడం.. తద్వారా తాము పుంజుకుంటామనే ధీమా కాంగ్రెస్‌లో ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు జరుగుతున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత.. దేశంలో ప్రత్యామ్నాయ కూటమికి పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే.. అలా కాకుండా.. కాంగ్రెస్ ఆయా పార్టీలను అనుసరించి లీడర్ షిప్ తీసుకుని, మోడీకి వ్యతిరేకంగా వ్యవహరించాలని చూస్తోందిఈ క్రమంలో రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ బలోపేతం అవుతుందని ఏపీకి చెందిన సీనియర్ల మధ్య చర్చలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే.. ఏపీకి చెందిన సీనియర్లు, కురువృద్ధులు ఇప్పుడు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని తెలుస్తోంది. ఇటీవల కొందరు నేతలు ఢిల్లీలో సమావేశమై.. ఇదే విషయాన్ని చర్చించారని కూడా అంటున్నారు. ముఖ్యంగా కొన్ని జిల్లాల్లో కాంగ్రెస్ కు ఇప్పటికీ కేడర్ ఉంది. అయితే.. ఓట్లు వేయకపోయనా.. జెండా మోసేందుకు రెడీగా ఉన్నారు. సో.. ఇలాంటి వారిని పోగొట్టుకోకుండా.. వైసీపీకి దాఖలైన ఓటు బ్యాంకును వెనక్కుతెచ్చుకునే ప్రయత్నం చేసేందుకు కేంద్రం నుంచి రావాల్సిన హక్కులనే ఆలంబనగా చేసుకుని ముందుకు సాగాలని నాయకులు నిర్ణయించుకున్నట్టు సమాచారం.అదే సమయంలో కాంగ్రెస్ జాతీయ నాయకత్వం ఏపీకి ప్రత్యేక హోదాతో పాటు ఏపీ అభివృద్ధిపై ప్రకటన చేస్తే అది కూడా ఏపీలో కాంగ్రెస్‌కు ప్లస్ అవుతుందని ఇక్కడ పాత కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు. మోడీపై తీవ్ర వ్యతిరేకత ఉన్న నేపథ్యంలో వచ్చే ఎన్నికల నాటికి కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంటుందన్న ఆశ వీరిలో ఉంది. మరి వీరి ఆశలు ఎంత వరకు ఫలిస్తాయో ? చూడాలి.

## గీతామయి వృద్ధాశ్రమానికి చేయూత

నెల్లూరు చిరంజీవి యువత గౌరవ సలహాదారులు, జె ఎన్ టి యు కమిటీ చైర్మన్, లాయర్ మలిరెడ్డి కోటారెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా , చిరంజీవి యువత ఆధ్వర్యంలో నగరంలోని బాలాజీ నగర్ ప్రాంతంలో ఉన్న గీతామయి వృద్ధుల ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధుల సహాయార్థం బియ్యం బస్తాలు, నిత్యవసర సరుకులు, కూరగాయలు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం చిరంజీవి యువత రాష్ట్ర కార్యదర్శి కొట్టే వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిత్రులు, శ్రేయోభిలాషులు మలిరెడ్డి కోటారెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం నిర్వహించు సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ప్రస్తుత కరోనా వైరస్ నేపథ్యంలో వృద్ధుల, వికలాంగుల, అనాధల ఆశ్రమాల నిర్వాహకులు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తుందన్నారు. ఈ క్రమంలో తమ వంతు చేయూతగా, మలిరెడ్డి కోటారెడ్డి సూచనలు సలహాల మేరకు గీతామయి వృద్ధుల ఆశ్రమానికి చేయూత ఇవ్వడం జరిగిందని తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులు, తన జన్మదినోత్సవం సందర్భంగా తమకు ఆసరాగా నిలిచిన మలిరెడ్డి కోటారెడ్డి ఇటువంటి జన్మదినోత్సవాలు అనేకం చేసుకోవాలని, అష్ట ఐశ్వర్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకులు తమ్మినేని పాండు, చిరంజీవి యువత రమేష్, చక్రి, చరణ్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# జగన్ బెయిల్ రద్దు స్టోరీ చాలా ఉందా

ఏలూరు, మే 19, (న్యూస్ పల్స్)రామాయణంలో ఒక కథ ఉంది. ఇంద్రజిత్తు కనబడకుండా ఆకాశం మీద నుంచి మాయా బాణాలు వేస్తాడని. శత్రువులను అలా నిర్జిస్తాడు అని. రాజకీయాల్లో చూసుకుంటే టీడీపీ అధినేత చంద్రబాబుకు తెర వెనక ఉండడమే మొదటి నుంచి ఇష్టం అంటారు. ఆయన బయటకు కనబడకుండా కావాల్సింది చక్క బడతారు అని చెబుతారు. ఎన్టీయార్ ని గద్దె దించినపుడు కూడా కుటుంబ సభ్యులకు లక్ష్మీ పార్వతిని రెండవ పెళ్ళి ఎన్టీయార్ చేసుకోవడం ఇష్టం లేదంటూ వారిని ముందు పెట్టారు. ఇక టీడీపీలో లక్ష్మీపార్వతి పెత్తనం మీద తమ్ముళ్ళు రగులుతున్నారంటూ మరో తెరను పెట్టారు. వెనకాల ఉన్నది మాత్రం చంద్రబాబు అని ఎన్టీయార్ గ్రహించేలోగానే ఆయన సీటు ఎగిరిపోయింది.పొరుగు పార్టీలో కలి పెట్టి తమాషా చూడడం చంద్రబాబుకు అలవాటు అంటారు. ఆ పార్టీ కలహాలతో కకావికలం అవుతూంటే అందులో నుంచి రాజకీయ లాభాన్ని తీసుకోవాలన్నది ఆయన వ్యూహం. చేతికి మట్టి అంటకుండా చేసే ఇలాంటి పనుల వల్ల అంతిమంగా తనకే ఫలితం దక్కుతుందని, తాను మాత్రం తెర వెనక పవిత్రంగా ఉండిపోవచ్చు అన్నది చంద్రబాబు మార్క్ ఆలోచన. కానీ

## తెర వెనుక కథ

ఇది సోషల్ మీడియా యుగం. ఎవరు ఎక్కడ మాట్లాడినా, ఎవరు ఏ విధంగా ధిక్కార స్వరాలు వినిపించినా వాటి మూలాలు ఎక్కడ ఉన్నాయి అన్నది సగటు జనాలకు ఈజీగా అర్ధమైపోతోంది. వైసీపీలో అందరిలాగానే ఒక ఎంపీ అయిన రఘురామ క్రిష్ణం రాజు జగన్ వంటి బలమైన నేతను ధిక్కరిస్తున్నారు అంటే ఆయన వెనక ఎవరో ఉంటారు అన్నది ఊహించలేనంత రాజకీయ అజ్ఞానంతో ఏపీ జనం లేదు అన్నదే విశ్లేషణ.జగన్ని నాడు జైలులో పెట్టించి తన పార్టీని విచ్చిన్నం కాకుండా చంద్రబాబు కాపాడుకున్నారు అంటారు. ఇపుడు ఏపీలో మధ్యాహ్న మార్తాండుడుగా మారిన జగన్ని తప్పిస్తేనే తప్ప విపక్షం బతికి బట్ట కట్టదు అని గుర్తెరిగే ఆయన బెయిల్ పిటిషన్ కధను తెర పైకి తెచ్చారు అంటారు. అయితే తామే అది చేస్తే రాజకీయ కక్ష కావేశం అని జనాలు అనుకుంటారని అతి తెలివితోనే రఘురామ క్రిష్ణం రాజు చేత బెయిల్ రద్దు పిటిషన్ వేయించారు అన్నది ప్రచారంలో ఉంది.

అయితే ఇలాంటి రాజకీయం వల్ల జగన్ ఇబ్బందులో పడితే భారీ లబ్ది పొందడానికి తెలుగుదేశమే సిద్ధంగా ఉంటుంది. మరి ఆ సంగతి తెలిసిన వారు ఎవరైనా రాజు అమాయకంగా జగన్ మీద యుద్ధం చేస్తున్నారు అనుకోగలరా అన్నదే చర్చ.ఏపీ రాజకీయం ఇపుడు పీక్స్ చేరింది. చంద్రబాబుకు పొరపాటున ఏం జరిగినా జగనే కారణం అంటారు. ఇక జగన్ కి ఏ రకమైనా ఇక్కట్లు ఎదురైనా కూడా బాబే చేయించాడు అని కూడా అంటారు. అంతలా ముఖాముఖీ ఢీ అంటే ఢీ కొడుతున్నా రాజకీయాల్లో ఇంకా ముసుగులు ఎందుకు అన్నదే ప్రశ్న. మాయా బాణాలు వేస్తూ ఏమీ ఎరగనట్లుగా కబుర్లు చెబితే కూడా జనం నమ్మడానికి సిద్ధంగా లేరు అన్నది నిజం. ఇక పోతే జనాలకు ఈ కుట్ర రాజకీయాలు, కుళ్ళు రాజకీయాలు కూడా అవసరం లేదు. వారికి కావాల్సినవి సమకూర్చినంతకాలం ఆ ఏలికను నెత్తిన పెట్టుకుంటారు. తమకు మోజు ఉన్నంతకాలం ఎవరు వచ్చి ఎన్ని చెప్పినా కూడా మాట వినరు సరికదా గెలిపిస్తూనే ఉంటారు. అందువల్ల మాయా యుద్ధం మానేసి రాజ మార్గంలో దర్జాగా జనాలకు గట్టి మేలు చేసే పని చేపట్టి అభిమానం పొందితేనే విపక్షాలకు అధికారం దక్కేది.

# సోలో బ్రతుకే సో బెటర్ అంటున్న వాసుపల్లి

విశాఖపట్టణం, మే 19, (న్యూస్ పల్స్)విశాఖలో ఆ ఎమ్మెల్యే హిస్టరీయే వేరు. ఆయన పూర్వాశ్రమంలో డిఫెన్స్ లో పనిచేశారు. తరువాత విశాఖలో విద్యాసంస్థలను నిర్వహించారు. సేవా కార్యక్రమాలను కూడా పెద్ద ఎత్తున చేపట్టి జనంలో మంచి పేరు తెచ్చుకున్నారు. ఆఖరుకు రాజకీయ రంగ ప్రవేశం చేశారు. తెలుగుదేశం పార్టీ తరఫున 2009 ఎన్నికల్లో తొలిసారి పోటీ పడి పరాజయం పాలు అయిన వాసుపల్లి గణేష్ కుమార్ 2014లో గెలిచి సత్తా చాటారు. 2019 ఎన్నికల్లో మరో మారు గెలిచి పట్టు నిలుపుకున్నారు.ఏపీలో ఇపుడు వైసీపీ అధికారంలో ఉంది. టీడీపీలో ఉన్నా కూడా విపక్ష ఎమ్మెల్యేగా మిగిలిపోవడం తప్ప ఉద్ధరించేది ఏదీ లేదు. అందుకే వాసుపల్లి గణేష్ కుమార్ తెలివిగా అధికార వైసీపీలోకి వచ్చేశారు అంటారు. ఇపుడు అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఆయన ఉంటూ ప్రభుత్వ కార్యక్రమాలను తన నియోజకవర్గంలో తన చేతుల మీదుగా అమలు చేస్తున్నారు ఆ విధంగా చూస్తే మిగిలిన టీడీపీ ఎమ్మెల్యేల కంటే కూడా ఆయన ముందు చూపుతో వ్యవహరించారు అని చెప్పుకోవాలి. మిగిలిన టీడీపీ ఎమ్మెల్యేలు ఉత్సవ విగ్రహాలుగా ఉంటే అక్కడ వైసీపీ ఇంచార్జిలే కథ మొత్తం నడిపిస్తున్నారు.ఇక వాసుపల్లి గణేష్ కుమార్ రాజకీయాలతో పాటు సేవా కార్యక్రమాలను కూడా చేపట్టి జనాదరణ చూరగొంటున్నారు. అంతే కాదు తన నియోజకవర్గం ప్రజలతో నేరుగా సంబంధాలు పెట్టుకుంటున్నారు. మంచికైనా చెడుకైనా సరే ప్రజల ముంగిట వాలే ఏకైక ఎమ్మెల్యేగా ఆయన నిలిచారు. దాంతో జనాలకు వాసుపల్లి గణేష్ కుమార్ మావాడు అన్న భావన కలుగుతోంది. ఆయనకు కూడా కావాల్సింది ఇదే. రేపటి రోజున తాను సొంత గుర్తింపుతో జనంలోకి వెళ్తే రాజకీయ పార్టీలు తన వెంట లేకపోయినా నెగ్గగలను అన్న ధీమా కోసమే ఆయన జనాలతో నిరంతం ఉంటూ సైలెంట్ గా పనిచేసుకునిపోతున్నారు అంటున్నారు.వాసుపల్లి గణేష్ కుమార్ ఇపుడు వైసీపీలో ఉన్నారు. మరో మూడేళ్ళలో జరిగే ఎన్నికల నాటిని ఆయన వైసీపీ నుంచే పోటీ చేస్తారా అంటే ఇపుడే చెప్పడం కష్టం అన్న మాట కూడా ఉంది. అపుడు రాష్ట్ర రాజకీయాలను బట్టి ఆయన డెసిషన్ ఉండే అవకాశాలే హెచ్చు అంటున్నారు. అపుడు కూడా ఇదే రకమైన జనాదరణతో వైసీపీ ఉంటే వాసుపల్లి గణేష్ కుమార్ కచ్చితంగా టికెట్ తెచ్చుకుంటారు. ఒక వేళ టీడీపీ మెరుగుపడితే మళ్ళీ మాతృ సంస్థ నుంచి పోటీ చేస్తారు. ఈ రెండు పార్టీలూ టికెట్ కాదన్నా కూడా తాను ఇండిపెండెంట్ గా పోటీ చేయడానికి అవసరం అయిన సరకూ సరంజామాను ఆయన ఇప్పటి నుంచే సమకూర్చుకుంటున్నారు అంటున్నారు. మొత్తానికి సోలోగా ఎదగడమే తన ఆలోచనగా వాసుపల్లి చెప్పకనే చెబుతున్నారు.

# విశాఖ కాంగ్రెస్ కు షాక్

## వైకాపాలో చేరిన రమణకుమారి

విశాఖపట్నం కాంగ్రెస్ పార్టీకి విశాఖ లో పెద్ద దెబ్బ తగిలింది. కాంగ్రెస్ లో రాష్ట్ర మహిళ అధ్యక్షురాలుగా ఉన్న రమణి కుమారి పార్టీ రాజీనామా చేసారు. ఎంపీ విజయసాయిరెడ్డి సమక్షంలో వైసీపీ లో చేరారు. ఎంపీ విజయసాయిరెడ్డి, మంత్రి అవంతి శ్రీనివాస్, నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్, ఇతర పార్టీ నేతలు, రమణికుమారిని వైసీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రమణికుమారి మాట్లాడుతూ వైసీపీ లో చేరటం చాలా ఆనందంగా ఉంది. సీఎం జగన్ మహిళలకు ఇస్తున్న ప్రాధాన్యతను చూసి ఈ రోజు నేను వైసీపీ పార్టీలో జాయిన్ అయ్యాను. విశాఖ ను ఒక రాజధాని చేయడం ఆయన పాలనకు ఒక ఉదాహరణ. విశాఖ రాజధాని అవ్వడం వలన ముఖ్యంగా నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు వస్తాయి. భవిషత్ లో పార్టీ పట్టిస్తాటకి నేను కృషి చేస్తానని అన్నారు.పర్యాటకశాఖ మంత్రి అవంతి శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో రమణికుమారి, నేను కాంగ్రెస్ పార్టీ లో కలిని పని చేసాము. సీఎం జగన్ పాలన చూసి రమణి కుమారి వైసీపీ లో చేరారు. గత ప్రభుత్వాలు మహిళలను కేవలం ఒక ఓట్ బ్యాంక్ గానే చూసారు. కానీ వైసీపీ ప్రభుత్వం ఏ పథకం పెట్టిన అది మహిళల పేరుతో అవ్వడం సీఎం జగన్ పాలనకు నిదర్శనం. ప్రతి పేద వాడిని ఆదుకునే విధంగా ఈ ప్రభుత్వ పాలన ఉంటుంది. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రతిపక్ష పార్టీలు సలహాలు ఇవ్వాలి కానీ దుష్ప్రచారం చేయకూడదు. తిరుపతిలో చంద్రబాబు, లోకేష్ సందు సందు తిరిగినా ప్రజలు ఆదరించలేదు, అందుకే హైద్రాబాద్ లో దాకున్నారని అన్నారు.ఎంపీ విజయసాయిరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ మహిళలకు ఇస్తున్న ప్రాధాన్యత చూసి రమణి కుమారి వైసీపీ లో చేరారు. రాబోయే రోజుల్లో పార్టీ అభివృదికి మరింతగా కృషి చేయాలని కోరుతున్నాము. పార్టీ ఆమెకి సముచిత స్థానం కల్పిస్తుంది. ప్రజల సమస్యలను లేవనెత్తిన, చర్చించే ఏకైక వేదిక అసెంబ్లీ. అలాంటి అసెంబ్లీ సమావేశాలను కరోనా పేరుతో టీడీపీ బాయ్ కాట్ చేశారు. సమస్యలను ఎదుర్కోలేక టీడీపీ అసెంబ్లీ మీ బాయ్ కాట్ చేసిందని అన్నారు.

# వినిపించని కుయ్...కుయ్... కుయ్

నెల్లూరు, మే 19, (న్యూస్ పల్స్)జగన్ గత ఏడాది కరోనా టైమ్ లో విజయవాడ బెంజ్ సర్కిల్ వద్ద జెండా ఊపి ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన 104 వాహనాలు ఏపీకే గర్వకారణం అని జాతీయ మీడియా కూడా రాసింది. వైద్య పరంగా ఇవి ఎంతో కీలకమైన పాత్ర పోషించేలా రూపొందించారు. ఒక్క ఫోన్ కాల్ రోగి ఇంటి నుంచి వెళ్తే క్షణాలలో తక్కున వాలిపోయి వారికి ఆసుపత్రికి చేర్చే పవిత్రమైన బృహత్తరమైన బాధ్యతను 104 వాహనాలు నిర్వహిస్తున్నాయి. ఇది నాటి సీఎం వైఎస్సార్ మానస పుత్రిక అయితే జగన్ దాన్ని మరింత విస్తృతం చేసి వేయికి పైగా వాహనాలను ఏపీ నిండా అన్ని జిల్లాల్లో ఉండేలా చేశారు.ఇదిలా ఉంటే కరోనా సెకండ్ వేవ్ మొదలైనప్పటి నుంచి 104 వాహనాలకు ఎంతో డిమాండ్ వచ్చిపడింది. అయితే ఈ వాహనాల పనితీరుని ఎవరు మానిటరింగ్ చేస్తున్నారో తెలియదు. పైగా ఫోన్లు ప్రాణాపాయంలో ఉన్న బాధితుడి ఇంటి నుంచి వెళ్తే రెస్పాన్స్ లేదని కూడా చెబుతున్నారు. ఇది ఇప్పటి సమస్య కూడా కాదు, గత ఏడాది మొదటి దశ కరోనా వేళ కూడా ఇలాగే జరిగింది. ఇపుడు అంతకు మించి కేసులు వస్తున్న వేళ కుయ్ కుయ్ సౌండే లేకుండా పోతోంది అన్న విమర్శలు అయితే ఉన్నాయి. వాటిని చెక్ చేసుకోవడానికి వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి విశాఖలో ఒక చోట నుంచి స్వయంగా ఫోన్ చేస్తే ఆయనకే షాక్ తగిలింది. రెస్పాన్స్ కూడా ఆయన కాల్ కి రాలేదంటే వాటి నిర్వాకం ఎలాగా ఉందో అర్ధం చేసుకోవాల్సిందే.ఇక్కడ వచ్చిన చిక్కు ఏంటి అంటే జగన్ ప్రతీ సంక్షేమ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తున్నారు. ఆయన వాటికి ఎంతో ప్రాధాన్యత కూడా ఇచ్చి నిధులు కూడా కేటాయిస్తున్నారు. అయితే ఒక్కసారి సీఎం చేతుల నుంచి కనుక అవి మారితే ఇక వాటి పనితీరులో తేడా వచ్చేస్తోంది అన్న విమర్శలు ఉన్నాయి. వందల కోట్లు వీటి కోసం ఖర్చు చేస్తున్నా కూడా సరైన సమయంలో ప్రజలకు ఉపయోగపడకపోతే వాటికి విలువ ఏముంటుంది. పైగా ప్రభుత్వానికి చెడ్డ పేరు కూడా వస్తోంది. సరిగ్గా ఈ విషయం మీదనే విజయసాయిరెడ్డి కూడా విసుక్కోవడం కనిపించింది. ఆయన సైతం ఇలా అయితే ఎలా అన్నట్లుగా వార్తలు వచ్చాయి.వైఎస్ ఆర్ టైమ్ లో ఇన్ని వాహనాలు లేవు, ఇంత హంగామా కూడా లేదు. కానీ వాటి పని తీరు ఘనంగా ఉండేది అని జనాలు ఇప్పటికీ చెప్పుకుంటారు. నాడు 23 జిల్లాల ఉమ్మడి ఏపీలో 104 సేవలు అమోఘం అని ఇప్పటికి అంటారు. వైఎస్సార్ సైతం కుయ్ కుయ్ అని తన ప్రచారంలో చెబుతూ జనాలకు వాటి సేవలు గుర్తు చేసేవారు. ఒక విధంగా వైఎస్సార్ పాలనకు అంబాసిడార్ గా మారిన 104 సేవలు ఇపుడు విమర్శల పాలు కావడం అంటే ఆలోచించాలి. తన తండ్రి చేసిన కార్యక్రమాలు మరో రెండు అడుగులు వేసి ఇంకా గొప్పగా చేస్తాను అని జగన్ చెబుతున్నారు. ఆయన చిత్తశుద్ధిని కూడా కాదనలేకపోయినా కూడా ఇక్కడ అమలులోనే తేడా వస్తోంది. వైఎస్సార్ మానస పుత్రికను కాపాడుకోవడంతో విఫలం అయితే ఎన్ని రకాల పథకాలు అమలు చేసినా కూడా వాటికి రాణింపు ఉండదు అన్నది జనం మాట.

# పీపీఎఫ్‌లో రూ.12 వేల మదుపు.. 15 ఏండ్లకు ఎంత లభిస్తుందంటే..

న్యూఢిల్లీ: రిస్క్ లేని అత్యంత ప్రాధాన్య ఇన్వెస్మెంట్ పథకంగా పబ్లిక్ ప్రావిడెండ్ ఫండ్ (పీపీఎఫ్) నిలుస్తుంది. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పని చేసే ఉద్యోగులు, అధికారులు రిటైర్మెంట్ తర్వాత భారీ మొత్తంలో కార్పస్ ఫండ్ అందిస్తుంది. అంతే కాదు.. దీనికి ఆదాయం పన్ను (ఐటీ) నుంచి మినహాయింపు లభిస్తుంది.పీపీఎఫ్‌లో పెట్టుబడి పెట్టిన మదుపర్లు ప్రతియేటా ఆదాయం పన్ను (ఐటీ) చట్టం -61 ప్రకారం తమ ఐటీ రిటర్న్స్‌లో పన్ను మినహాయింపు కోరవచ్చు. ప్రభుత్వ మద్దతుతో అమలవుతున్న చిన్న మొత్తాల పొదుపు పథకం.. ఎటువంటి క్యాపిటల్ రిస్క్ లేదు.ప్రతిఏటా పీపీఎఫ్ కింద పెట్టే పెట్టుబడులపై ప్రతి మూడు నెలలకోసారి వడ్డీని కేంద్ర ప్రభుత్వం ఖరారు చేస్తుంది. వార్షిక ప్రాతిపదికన ప్రస్తుతం పీపీఎఫ్ కింద చేసిన పెట్టుబడులపై 7.1 శాతం వడ్డీరేటు అందిస్తున్నది.ఇతర పన్ను మినహాయింపు పొదుపు పథకాలతో పోలిస్తే పీపీఎఫ్‌పై అధిక వడ్డీరేటు లభిస్తుందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ద్రవ్యోల్బణాన్ని ఈ వడ్డీరేటు అధిగమించడంతోపాటు భారీ మొత్తంలో కార్పస్ నిధి సమకూరుతుంది.భారీగా లభించే కార్పస్ నిధి మీకు రిటైర్మెంట్ నిధిగా ఉపయోగించుకోవచ్చు. పిల్లల చదువులు, వివాహ ఖర్చులకు కూడా వాడొచ్చు. పీపీఎఫ్ కింద గరిష్ఠంగా ప్రతియేటా రూ.1.5 లక్షలు ఇన్వెస్ట్ చేయొచ్చు.పీపీఎఫ్ ఖాతా 15 ఏండ్లకు మెచ్యూర్ అవుతుంది. ఐదేండ్ల చొప్పున పలు దఫాలు దీన్ని పొడిగిస్తారు. ఉదాహరణకు నెలకు రూ.12 వేల చొప్పున ఇన్వెస్ట్ చేస్తే 15 ఏండ్లు పూర్తయిన తర్వాత అది రూ.39,05,480.85 అవుతుంది.ఈ పథకంలో ఇన్వెస్ట్ చేసిన వారు మధ్యలో విత్ డ్రాయల్ చేయకుంటే.. 15 ఏండ్ల తర్వాత అది రూ.1.09 కోట్లకు పెరుగుతుంది. ప్రతిఏటా నిర్ణయించే వడ్డీరేటు ఆధారంగా పీపీఎఫ్ ఖాతాలో



సొమ్ము పెరుగుతుంది.అయితే, 25 ఏండ్ల వయస్సులో పెట్టుబడులు పెట్టడం మొదలు పెడితే 40 ఏండ్లకు మెచ్యూరవుతుంది. తదుపరి పెట్టుబడి పెట్టకుండా 55 ఏండ్ల వరకు ఈ ఖాతా కొనసాగించొచ్చు. అలా కొనసాగించడం వల్ల మీరు పెట్టిన రూ.39 లక్షల పెట్టుబడి రూ.1.09 కోట్లవుతుంది.ఆ తర్వాత కూడా ఇదే పెట్టుబడిని మరికొంత కాలం పొడిగించేందుకు వెసులుబాటు ఉంది.. గరిష్ఠంగా 30 ఏండ్ల వరకు పొడిగించొచ్చు. అలా పొడిగించిన తర్వాత సదరు పీపీఎఫ్ ఖాతాలో మదుపు చేసిన మొత్తం రూ.1.48 కోట్లకు పెరుగుతుంది.అయితే, వడ్డీరేట్లలో తేడాను బట్టి కార్పస్ నిధి మారుతూ ఉంటుంది. పీపీఎఫ్ ఖాతా కింద ఆప్షన్ ఖరారు చేస్తే ఐదేండ్ల వరకు మార్చడం కుదరదు. ప్రారంభంలోనే ఎక్స్‌టెన్షన్ పీరియడ్‌ను మీరు తప్పనిసరిగా పేర్కొనాల్సి వస్తుంది.

# తాడిపత్రి వద్ద 500 ఆక్సిజన్ పడకల తాత్కాలిక ఆసుపత్రి పనులను వేగంగా చేపట్టాలి

## జాయింట్ కలెక్టర్ (రెవెన్యూ) నిశాంత్ కుమార్

అనంతపురం, మే 19 :తాడిపత్రి ప్రాంతంలోని ఆర్జాస్ స్టీల్ ఫ్యాక్టరీ సమీపంలో 500 ఆక్సిజన్ పడకలతో ఏర్పాటు చేస్తున్న తాత్కాలిక ఆసుపత్రి పనులను వేగంగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ (రెవెన్యూ) నిశాంత్ కుమార్ ఆదేశించారు. బుధవారం తాడిపత్రి వద్ద ఆర్జాస్ స్టీల్ ఫ్యాక్టరీ సమీపంలో ఏర్పాటు చేస్తున్న తాత్కాలిక ఆసుపత్రి పనులను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ కోవిడ్ బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించే క్రమంలో తాడిపత్రి వద్ద 500 బెడ్లతో జర్మన్ హ్యాంగర్స్ లతో తాత్కాలిక ఆసుపత్రిని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. తాత్కాలిక ఆసుపత్రి వద్ద చేపడుతున్న ఆక్సిజన్ పైప్ లైన్ పనులు, తాగునీటి సరఫరా పనులు, విద్యుత్ సరఫరా, పార్కింగ్ ఏర్పాట్లు, అప్రోచ్ రోడ్ల నిర్మాణం, భోజన వసతి స్టాళ్లు ఏర్పాటును త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా కొన్ని సేవ సంస్థలు స్వచ్ఛందగా ముందుకు వచ్చి కొవిడ్ బాధితులకు నిత్య అన్నదానం మరియు వివిధ సేవ కార్యక్రమాలు చేపడతామని కోరారు; ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్డీవో గుణ భూషణ్ రెడ్డి, పరిశ్రమల శాఖ జియం అజయ్ కుమార్, ఏపీఎంఎస్ఐడిసి డిఈ చంద్రశేఖర్ రెడ్డి, తహశీల్దార్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# ఇది కార్పరేట్ మాఫియా పని

అనందయ్య అభిమానులు

నెల్లూరు కరోనా సమయంలో ఆయుర్వేద వైద్యం మరోసారి తెరపైకి వచ్చింది.సాంకేతిక పరిజ్నానం కొత్తపుంతలు తొక్కుతున్న తరుణంలో ఇంకా పురాతన వైద్యంగా కొనసాగుతున్న ఆయుర్వేద వైద్యాన్ని ప్రజలు ఇంకా విశ్వసిస్తున్నారు.నెల్లూరు జిల్లాలో ముత్తుకూరు మండలం కృష్ణపట్నంలో కరోనాకు ఉచితంగా ఆయుర్వేద మందు ఇస్తున్నారంటూ జనాలు భారీగా రావడంతో అదికారులు మందుల పంపిణీకి బ్రెక్ వేశారు.అయితే అదికారుల తీరుపై ప్రజలు విభిన్నంగా స్పందిస్తున్నారు.ముత్తుకూరు మండలం కృష్ణ పట్ట గ్రామంలో కరోనాకి ఆయుర్వేదిక్ మెడిసిన్ ఆనందయ్య అందిస్తున్నారని,కరోనా బాధితులకు సేవలందిస్తున్న ఆనందయ్య కరోనా మందును జిల్లా అధికార యంత్రాంగం ఆపివేయడం సరికాదని అంటున్నారు.ఇది కచ్చితంగా కార్పోరేట్ మెడికల్ మాఫియా కుట్ర ఉందని ఆరోపించారు.వేలాది మందికి సాయం చేస్తున్న ఆనందయ్య కరోనా మందును నిలిపివేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో సిటి స్కాన్ ఎంఆర్ఐ స్కాన్ యంత్రాలు ప్రారంభం

నెల్లూరు నెల్లూరు పట్టణంలోని ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో బుధవారం సిటి స్కాన్ ఎంఆర్ఐ స్కాన్ యంత్రాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో సిటీ స్కాన్, ఎమ్మారై స్కాన్ యంత్రాలని వర్చువల్ ద్వారా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు.

# నిరుద్యోగ యువత కోసం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలి

## వెంకటగిరి శాసనసభ్యులు ఆనం

నెల్లూరు నెల్లూరు జిల్లా వెంకటగిరి నియోజక వర్గంలో నిరుద్యోగ యువత కోసం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డిని మాజీ ఆర్థిక మంత్రి, వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణ రెడ్డి కోరారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ఆర్థిక శాఖ మంత్రివర్యులు, వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణ రెడ్డి నెల్లూరు నివాసంలో,ఆంధ్ర ప్రదేశ్ పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డితో భేటీ లో భాగంగా, వెంకటగిరి నియోజకవర్గం లో నిరుద్యోగ యువత కోసం,పారిశ్రామిక అభివృద్ధి కొరకు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఆనం, మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డిని కోరారు. అందుకు మంత్రి స్పందిస్తూ, వెంకటగిరిలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు విషయంపై నియోజకవర్గంలోని స్థానిక నాయకులతో, సంప్రదింపులు జరిపి స్థల సేకరణ ప్రారంభిస్తామని మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి ఎమ్మెల్యే ఆనంకి తెలియజేశారు. అదేవిధంగా కండలేరు జలాశయం నుంచి నెల్లూరు జిల్లా లోని ప్రజలకు ఇచ్చే నీటి సరఫరా పైపులైన్ల పనితీరు నాణ్యతతో జరగడం లేదని, దీని మీద విజిలెన్స్ ఎంక్వయిరీ చేయాలని,ఈ పైప్ లైన్ పనులకు సంబంధించి మొత్తం పనులను జెసిపి ఆపరేటర్ లు చేస్తున్నారని ,అలాగే పరిశ్రమల శాఖకు చెందిన ఏ ఒక్క ఉద్యోగి లేకుండా ఆ కాంట్రాక్టర్ మనుషుల చేత పనులు చేయిస్తున్నారని ఎమ్మెల్యే ఆనం, మంత్రి గౌతమ్ రెడ్డి కి వివరించారు. వెంకటగిరి నియోజకవర్గం లోని పల్లెల మీదుగా వెళ్తున్న నీటి పైప్ లైన్లు నాణ్యత లేకపోవడం వల్ల ఆ ప్రాంత రైతులు, గ్రామస్తులు భయభ్రాంతులకు గురి అవుతున్నారని,ఈ పైప్ లైన్ పనుల నాణ్యతపై తగు విచారణ జరిపించాలని పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డిని మాజీ ఆర్థిక మంత్రివర్యులు, వెంకటగిరి శాసనసభ్యులు, ఆనం రామనారాయణ రెడ్డి కోరారు.

# చిన్నశేష వాహనంపై గోవిందుని రాజసం

తిరుపతి మే 19 శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన బుధవారం ఉదయం శ్రీ స్వామివారు చిన్నశేష వాహనంపై అనుగ్రహించారు. కోవిడ్ -19 వ్యాప్తి నేపథ్యంలో ఆలయంలో ఏకాంతంగా వాహనసేవ నిర్వహించారు. చిన్నశేష వాహనం స్వామివారి వ్యక్తరూపమైన పంచభౌతిక ప్రకృతికి సంకేతం. కనుక ఈ వాహనం పంచభూతాత్మకమైన విశ్వానికి, అందునివసించే జీవునికి వరాలిస్తుంది. విశ్వం కన్పించే శ్రీవారి ప్రకృతి. విష్ణువు ఈ ప్రకృతికి ఆధారమై దాన్ని నడిపించేశక్తి. స్వామి విశ్వాన్ని రక్షించేవాడు కనుక శేషునిపై తానొక్కడే విహరించాడు. పంచశిరస్సుల చిన్నశేషుని దర్శనం మహాశ్రేయఃప్రదం. శేషవాహనోత్సవాన్ని దర్శిస్తే దుష్టశక్తుల వల్ల కలిగే దుష్ఫలాలు తొలగి, భక్తులు కుండలినీయోగ సిద్ధించి, సుఖశాంతులతో ఆనందజీవులతారు.స్నపన తిరుమంజనం - ఉత్సవాల్లో రెండవ రోజు కార్యక్రమాల్లో భాగంగా ఉదయం 9.30 నుండి 10.30 గంటల వరకు కల్యాణమండపంలో స్నపనతిరుమంజనం నిర్వహించారు.ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనంలతో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేషంగా అభిషేకం చేశారు.

# పిల్లలను పనుల్లో పెట్టుకుంటే కఠిన చర్యలు

నూజివీడు కృష్ణా జిల్లా నూజివీడు పోలీస్ సర్కిల్ పరిధిలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు ఆపరేషన్ ముస్కాన్ నిర్వహించారు. సర్కిల్లో 10మంది పిల్లలను పనులు చేయిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు, వారికి ప్రభుత్వ ఆసుపత్రిలో కోవిడ్ టెస్టులు చేయించారు. వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించి, పిల్లలను వారికి అప్పగిస్తున్నట్లు సీఐ వెంకటరమణ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా మైనర్ పిల్లలను పనిలో పెట్టుకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# దిగ్విజయంగా ఆపరేషన్ ముస్కాన్

మచిలీపట్టణం మచిలీపట్నంలో ఆపరేషన్ ముస్కాన్ దిగ్విజయంగా కొనసాగిందిజ వీధి పిల్లలు, అనాధ పిల్లలు, ఆర్థిక ఇబ్బందులతో కొంత మంది తల్లిద్రండ్రులు పనులకు పంపించటం లాంటి పిల్లలకోసం ఈ ఆపరేషన్ ముస్కాన్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్ బాబు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉన్నా చైల్డ్ లేబర్ కరెక్ట్ కాదు. ఇల్లాంటి పిల్లల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తుంది. తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నాం. పిల్లలను తదివించితే తరువాత తరం అయినా ఆర్థిక ఇబ్బందులు పడవు . కొంత మంది పిల్లలను గుర్తించాం. ళ్లందరినీ కోవిడ్ పరీక్షలు అనంతరం ప్రభుత్వ కేర్ సెంటర్స్ కు తరలిస్తాం. ఎవరైనా కోవిద్ బారిన పడివుంటే వారికోసం కోవిద్ సెంటర్లు గుర్తించం అక్కడికి తరలిస్తామని అన్నారు.

# పెనమలూరులో శాశ్వత వ్యాక్సిన్ కేంద్రం

పెనమలూరు కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గం కంకిపాడు గ్రామంలో జెడ్ పి హెచ్ హై స్కూల్ నందు శాశ్వత వ్యాక్సినేషన్ సెంటర్ పెట్టడం జరిగింది. ఉప్పులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కింద వచ్చే ఈ వ్యాక్సిన్ సెంటర్ కి చుట్టుపక్కల గ్రామాలలో ఉన్న ప్రతి ఒక్కరూ వచ్చి కో వ్యాక్సిన్ రెండో దోస్ వ్యాక్సినేషన్ వేయించుకోవాలని డాక్టర్ సుందర్ కుమార్ తెలియజేశారు . ఈ కార్యక్రమంలో కంకిపాడు ఎం పి డిఓ కొడాలి అనురాధ, కంకిపాడు ఎమ్మార్వో సతీష్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు

# మే 20 నుండి 22వ తేదీ వరకుఏకాంతంగా శ్రీ పద్మావతి పరిణయోత్సవాలు

తిరుమల మే 19 శ్రీ పద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవాలు మే 20 నుండి 22వ తేదీ వరకు తిరుమల శ్రీవారి ఆలయంలో ఏకాంతంగా జరుగనున్నాయి. కోవిడ్-19 వ్యాధి వ్యాప్తి నివారణ చర్యల్లో భాగంగా టిటిడి ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. శ్రీవారి ఆలయంలోని కల్యాణమండపంలో మూడు రోజులపాటు మధ్యాహ్నం 3 గంటల నుండి ఈ వేడుకలు నిర్వహిస్తారు. తొలిరోజు శ్రీ మలయప్పస్వామివారు గజవాహనం, రెండవరోజు అశ్వవాహనం, చివరిరోజు గరుడవాహనంపై వేంచేపు చేస్తారు. మరోపక్కఉభయనాంచారులు ప్రత్యేక పల్లకీల్లో వేంచేపు చేస్తారు. ఆ తరువాత పరిణయోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఆర్జిత సేవలు రద్దు : శ్రీ పద్మావతి పరిణయోత్సవాల సందర్భంగా మే 20 నుండి 22వ తేదీ వరకు ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టిటిడి రద్దు చేసింది.

పౌరాణిక ప్రాశస్త్యం : పురాణాల ప్రకారం సుమారు ఐదు వేల ఏళ్ల కిందట, అంటే కలియుగం తొలినాళ్లలో సాక్షాత్తు శ్రీమహావిష్ణువు వైకుంఠం నుండి శ్రీ వేంకటేశ్వరునిగా భూలోకానికి తరలివచ్చారు. ఆ సమయంలో నారాయణవనాన్ని పరిపాలిస్తున్న ఆకాశరాజు తన కుమార్తె అయిన శ్రీ పద్మావతిని శ్రీవేంకటేశ్వరునికిచ్చి వివాహం చేశారు. ఆకాశరాజు వైశాఖశుద్ధ దశమి శుక్రవారం పూర్వ ఫల్గుణి నక్షత్రంలో నారాయణవనంలో కన్యాదానం చేసినట్లుగా శ్రీ వేంకటాచల మహాత్మ్యం గ్రంథం తెలుపుతోంది. ఆనాటి పద్మావతీ శ్రీనివాసుల కల్యాణోత్సవ తరువాత ఒక రోజు కలిపి మొత్తం మూడురోజుల పాటు పద్మావతీ పరిణయోత్సవాన్ని టిటిడి నిర్వహిస్తోంది. 1992వ సంవత్సరం నుంచి ఈ ఉత్సవం జరుగుతోంది. ఆనాటి నారాయణవనానికి ప్రతీకగా తిరుమల నారాయణగిరి ఉద్యానవనంలో ప్రతి ఏటా శ్రీ పద్మావతీ పరిణయ వేడుకలు నిర్వహించేవారు.

# డోన్ లో క్వారంటైన్ ఆక్సిజన్ బెడ్స్ ఏర్పాటు చేయాలని తాసిల్దార్ కార్యాలయం ముందు సీపీఐఆందోళన

డోన్ ( విభారె) డోన్ పట్టణంలో కరోనా బాధితుల కోసం క్వారంటైన్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని డోన్ ప్రభుత్వ వైద్యశాల నందు ఆక్సిజన్ బెడ్స్ ఏర్పాటు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు,స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సి పి ఐ ఆధ్వర్యంలో ప్లకార్డు పట్టుకుని నినాదాలు చేశారు, ఈ ధర్నా కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సుంకయ్యఅధ్యక్ష వహించారు ధర్నా కార్యక్రమంలో సిపిఐ డోన్ నియోజకవర్గ కార్యదర్శి రంగనాయుడు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె రాధాకృష్ణ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి మోటా. రాముడు ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పులి శేఖర్,నారాయణ మాట్లాడుతూ కరోనా మహమ్మారి సెకండ్ వేవ్ లో డోన్ పట్టణంలో మోడల్ స్కూల్ నందు క్వారంటైన్ సెంటర్ ను డోన్ హాస్పిటల్ నందు ఆక్సిజన్ బెడ్స్ సౌకర్యం కల్పించాలని వారు అధికారులను డిమెండ్ చేశారు.డోన్, ప్యాపిలి, బేతంచెర్ల, వెల్దుర్తి, క్రిష్ణగిరి,మండలంలోని ప్రజలకు ఉపయోగించే విదంగా డోన్ లో ఏర్పాటు చేయాలని అదేవిధంగా ఒక నెల రోజుల నుండి దాదాపు 1000 మందికి పైగా కరోనా పాజిటివ్ కేసులు రావడం జరిగింది. వారందరినీ కర్నూల టి టి కో క్వారంటైన్ సెంటర్ కు తరలిస్తున్నారు కొంతమంది చిన్న పిల్లలు తల్లిదండ్రులను వదిలి పోవాలంటే అనేకమంది ఇబ్బందులు పడుతున్నారు. కరోనా మొదటి దశలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన గారు ఏర్పాటు చేసి మంచి పని చేశారు అప్పుడు కేసులు తక్కువగా ఉన్నాయి నేడు రోజుకు వందల సంఖ్యలో కేసులు వస్తున్న నేడు అధికారులు స్పందించడం లేదు దీనిపై వెంటనే స్పందించి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని అదేవిధంగా డోన్ పట్టణంలో సి హెచ్ ఎం సి హాస్పిటల్ లో ఉన్నప్పటికీ ఆక్సిజన్ సౌకర్యం లేక కరోనా బాధితులు అనేక మంది మృత్యువాత పడుతున్నారు ఫోటోగ్రాఫర్ ఆక్సిజన్ లేక మరణించాడు అలాంటి సంఘటనలు చాలా జరుగుతున్నాయి కావున వెంటనే స్పందించి డోన్ ప్రభుత్వ వైద్యశాల నందు ఆక్సిజన్ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా కరోనా మృతుల ఒక్కొక్కరికి పది లక్షల రూపాయలు ఎక్స్రేషియా ప్రకటించాలని వారు అధికారులకు వినతిపత్రం అందజేశారు ఈకార్యక్రమంలో సీపీఐ ప్రజా సంఘాల నాయకులు. మాబాష, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శి లు.పుల్లయ్య . అబ్బాస్, ఏ పి మహిళ సమాఖ్య నాయకురాలు. లక్ష్మీదేవి, హసీనా ,ఏ పిరైతు సంఘము కార్యదర్శి. కె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

# దువ్వూరు పోలీసుల సాహసం

## బావిలో పడ్డ వృద్ధురాలు సురక్షితం సాహసపోలీసులను అభినందించిన ఎస్పీ

కడప మే 19 దువ్వూరు పట్టణం లోని ఓ పాడుబడ్డ బావిలో ప్రమాదవశాత్తూ పడిపోయిన వృద్ధురాలిని సాహసోపేతంగా శ్రమించి రక్షించి..రక్షకులు ప్రజల రక్షణ కోసమే అని నిరూపించారు దువ్వూరు ఎస్.ఐ కుళ్లాయప్ప ఆధ్వర్యంలోని సిబ్బంది. వివరాల్లోకెళితే బుధవారం మధ్యాహ్నం దువ్వూరు పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన వృద్ధురాలు వెంకటమ్మ (65) దారిన వెళ్తూ ప్రమాదవశాత్తూ కాలనీ లోని పురాతనమైన ఏటవాలుగా ఉన్న 30 అడుగుల బావి లో జారి పడిపోయినట్లు గమనించిన ఓ మేకల కాపరి ఇచ్చిన సమాచారం అందుకున్న పోలీసులు తక్షణం ఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే రంగంలోకి దిగిన ఎస్.ఐ కుళ్లాయప్ప, కానిస్టేబుల్ బాబా ఫక్రుద్దీన్, సి.పి.ఓ ఉదయ్ లు తాడు సాయంతో బావిలోకి దిగి వృద్ధురాలిని తాళ్ల సాయంతో మోసుకుని బయటికి తీసుకువచ్చారు. వృద్ధురాలి మనవడు కిరణ్, వృద్ధురాలి కోడలు ఎస్.ఐ కుళ్లాయప్ప కు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. పోలీసు శాఖ చేసిన సాయాన్ని జీవితాంతం మరువలేమని, పోలీసు శాఖకు రుణపడి ఉంటామని ధన్యవాదాలు తెలిపారు.అభినందించిన జిల్లా ఎస్.పి సాహసోపేతంగా, సమయస్ఫూర్తితో వ్యవహరించి వృద్ధురాలి ప్రాణాలను కాపాడిన ఎస్.ఐ కుళ్లాయప్ప, హెడ్ కానిస్టేబుల్ బాషా, కానిస్టేబుల్ బాబా ఫక్రుద్దీన్, సి.పి.ఓ ఉదయ్, ముని లను జిల్లా ఎస్.పి కే.కే.ఎన్ అన్బురాజన్ ప్రత్యేకంగా అభినందించారు. అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచారని, పోలీసు శాఖ ప్రతిష్టను మరింత ఇనుమడింపచేశారని కొనియాడారు.

## ఘనంగా అనంత పద్మనాభ స్వామి ఆలయం ప్రారంభోత్సవం

ఎమ్మిగనూరు పట్టణంలోని మంత్రాలయం రోడ్ లో నూతనంగా నిర్మించిన శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కొవిడ్ దృష్ట్యా భౌతిక దూరం పాటిస్తూ.. మాస్క్?లు ధరించి దేవాలయంలో పూజలు చేశారు.కొవిడ్ నిబంధనలు పాటిస్తూ భక్తులు హాజరయ్యారు. బుధవారం నుండి శనివారం వరకు మూడు రోజుల పాటు శ్రీ అనంత పద్మనాభ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు జరుగుతాయని వేదపండితులు తెలియజేశారు. శనివారం తెల్లవారు జామున బ్రహ్మముహూర్తంలో శ్రీ అనంత పద్మనాభ స్వామి విగ్రహ ప్రతిష్ఠ,అనంతరం కల్యాణోత్సవం, సాయంత్రం పల్లకి సేవ జరుగునని వారు తెలిపారు.దేవాలయ ప్రారంభోత్సవానికి చుట్టుపక్కల ప్రజలు తరలివచ్చారు. కార్యక్రమం అనంతరం అన్నదానం నిర్వహించారు.

# ఊపిరితిత్తులను బలోపేతం చేయడానికి 5 శ్వాస వ్యాయామాలు చేయండి చాలు..



గత కొద్ది రోజులుగా భారతదేశంలో రోజువారీ 4 లక్షలకు పైగా కోవిడ్ కేసులు ఉన్నందున, దేశం కోవిడ్‌కు వ్యతిరేకంగా అతిపెద్ద ఆరోగ్య సంరక్షణ పోరాటంలో ఉంది. కరోనా వైరస్ రెండవ వేవ్ తీవ్రంగా మారుతుంది మరియు శరీరంలోని అనేక అవయవాలపై తీవ్రమైన ప్రభావాలను చూపుతుంది. కోవిడ్ వైరస్ ప్రధానంగా ఊపిరితిత్తులు మరియు శ్వాసకోశ వ్యవస్థపై దాడి చేస్తుందని ఇప్పటికే స్పష్టమైంది.ఇలాంటి క్లిష్టమైన సమయంలో, సహజంగా ఊపిరితిత్తుల పనితీరును పెంచడానికి మనం చేయగలిగినదంతా చేయడం అత్యవసరం. మీ ఊపిరితిత్తులను బలోపేతం చేయడానికి మరియు ఆక్సిజన్ ప్రవాహాన్ని పునరుద్ధరించడానికి మీకు సహాయపడే వాటిలో వ్యాయామం ఒకటి. అంటే, లోతైన శ్వాస వ్యాయామాల ద్వారా మీరు మీ ఊపిరితిత్తులను బలోపేతం చేయవచ్చు. ఈ వ్యాసంలో మీరు మీ ఊపిరితిత్తులను బలంగా ఉంచడానికి మరియు శరీరంలో ఆక్సిజన్ స్థాయిని పెంచడానికి సహాయపడే కొన్ని శ్వాస వ్యాయామాల గురించి ఇక్కడ చూడండి...ఊపిరితిత్తులను బలోపేతం చేసే శ్వాస మరియు వ్యాయామాలు, ముఖ్యంగా లోతైన శ్వాస వ్యాయామాలు మీ దయాఫ్రాగమ్ పనితీరును పునరుద్ధరించడానికి మరియు శ్వాసించే సామర్థ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఇది శ్వాసకోశ వ్యవస్థలోని అడ్డంకిని తొలగించడానికి మిమ్మల్ని అనుమతిస్తుంది. ఇది శ్లేష్మం తొలగిస్తుంది మరియు సంతృప్త స్థాయిలను పునరుద్ధరిస్తుంది, తద్వారా సంక్రమణతో పోరాడటానికి సహాయపడుతుంది. క్లినికల్ అధ్యయనాలు కోవిడ్ ఉన్న రోగులలో, కొన్ని శ్వాస విధానాలు ఊపిరి తగ్గడానికి మరియు సమస్యలను గణనీయంగా తగ్గించటానికి సహాయపడతాయని తేలింది. అదనంగా, లోతైన శ్వాస రోగి కోలుకునే సమయంలో ఒత్తిడి మరియు ఆందోళనను తగ్గించడానికి మరియు వేగంగా నయం చేయడానికి సహాయపడుతుంది.లోతైన శ్వాస అనేది సులభమైన మరియు అతి ముఖ్యమైన శ్వాస వ్యాయామాలలో ఒకటి. ఇది మన ఊపిరితిత్తులను బలోపేతం చేయడానికి, రక్త ప్రసరణ మరియు రోగనిరోధక శక్తిని మెరుగుపరచడానికి మరియు ఒత్తిడి మరియు ఆందోళన నుండి ఉపశమనానికి సహాయపడుతుంది.

రిలాక్స్ పొజిషన్‌లో కూర్చుని, లోతైన శ్వాస తీసుకోండి మరియు మీ శ్వాసను బిగబట్టి ఒకటి నుండి పది లెక్కించండి. మీ శ్వాస మరియు ఉఛ్వాస సంఖ్య సమానంగా ఉండాలి. ప్రతి శ్వాసతో సాధ్యమైనంతవరకు నోటిలోకి మరియు వెలుపల శ్వాస తీసుకోండి. ఇది 2 నుండి 5 నిమిషాలు కొనసాగవచ్చు.డయాఫ్రాగ్మాటిక్ శ్వాసను ఉదర శ్వాస అని కూడా అంటారు. ఈ వ్యాయామం చేయడం వల్ల డయాఫ్రాగమ్ పనితీరు మెరుగుపరచడానికి మరియు ఊపిరితిత్తుల అడుగు భాగానికి ఎక్కువ గాలి లభిస్తుంది. దీన్ని సాధన చేయడం ద్వారా మీరు సులభంగా ఊపిరి పీల్చుకోవచ్చు. డయాఫ్రాగ్మాటిక్ శ్వాసను అభ్యసించడానికి, మొదట నేలమీద నిశ్శబ్దంగా కూర్చోండి లేదా నిటారుగా పడుకోండి. మీ ముందు దంతాల వెనుక నాలుక కొన ఉంచండి. మీ వీపును నిటారుగా చేసి, కళ్ళు మూసుకోండి. సాధారణంగా ఊపిరి పీల్చుకోవడానికి ప్రయత్నించండి, ఆపై ఒక చేతిని ఛాతీపై మరియు ఒక చేతిని మీ పొత్తికడుపుపై ??ఉంచండి. ముక్కు ద్వారా లోతుగా ఊపిరి పీల్చుకోండి, మీ పక్కటెముకలు విస్తరించండి మరియు ఉదరం బయటికి విస్తరించండి. పొత్తికడుపును సాగదీసి పీల్చుకోండి. 10 సార్లు వరకు ఇదే విధంగా నెమ్మదిగా మరియు లోతుగా ఊపిరి పీల్చుకోండి.మీ శ్వాసను నియంత్రించడం ద్వారా నరాలను శాంతపరచడానికి ప్రాణాయామం ఉత్తమ శ్వాస వ్యాయామం. ఇది మీ ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది మరియు రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

## క్రికెటర్ తీరుపై అధికారుల అసహనం

లక్నో: టీమిండియా క్రికెటర్ కుల్దీప్ యాదవ్ తీరుపై కాన్పూర్ జిల్లా యంత్రాంగం అసహనం వ్యక్తం చేసింది. తమకు సమాచారం ఇవ్వకుండానే గెస్ట్‌హౌజ్‌లో కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకున్న అతడి వ్యవహారశైలిని తప్పుబట్టింది. కాగా 18 ఏళ్లు పైబడిన వారికి కరోనా టీకా ఇచ్చేందుకు కేంద్రం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కుల్దీప్ యాదవ్, స్థానిక గోవింద్‌నగర్‌లోని జగదీశ్వర్ ఆస్పత్రిలో వ్యాక్సిన్ వేయించుకునేందుకు స్లాట్ బుక్ చేసుకున్నాడు. అయితే, ఆస్పత్రికి వెళ్లకుండా కాన్పూర్ నగర్ నిగం అతిథి గృహంలోనే టీకా తీసుకున్నాడు. ఇందుకు సంబంధించిన ఫొటోను కుల్దీప్ ట్విటర్‌లో షేర్ చేశాడు. కోవిడ్‌పై పోరులో అంతా ఒక్కటి కావాలని, అవకాశం ఉన్నవాళ్లు త్వరితగతిన టీకా వేయించుకోవాలని విజ్ఞప్తి చేశాడు. సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టిన ఈ పోస్టు కాన్పూర్ జిల్లా అధికారుల కంటపడింది. ఈ నేపథ్యంలో తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా కుల్దీప్ వ్యవహరించిన తీరుపై వారు విస్మయానికి గురయ్యారు. ఇక ఈ విషయంపై స్పందించిన కాన్పూర్ జిల్లా మెజిస్ట్రేట్ అలోక్ తివారి విచారణకు ఆదేశించారు. ఎవరి అనుమతితో గెస్ట్‌హౌజ్‌లో కుల్దీప్ వ్యాక్సిన్ వేసుకున్నాడనే అంశంపై ఆరా తీస్తున్నారు.

# ఆహాలోకి మరో సస్పెన్స్ థ్రిల్లింగ్ వెబ్ సిరీస్..!




దేశంలో కరోనా పరిస్థితి నెలకొన్నప్పటి నుండి ప్రతి రంగంలో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. అందులో ముఖ్యంగా సినిమా రంగంలో చాలా మార్పులు జరిగాయి. దేశం మొత్తం మీద సినీరంగమే బాగా మార్పు చెందిందని చెప్పుకోవచ్చు. ఎందుకంటే వ్యాపారం - రాజకీయం అనేవి ఎప్పటికప్పుడు మార్పులు చెందుతూనే ఉంటాయి. కానీ సినీ రంగంలో మార్పులు అరుదుగా కనిపిస్తాయి. అందులోను టాలీవుడ్ ఇండస్ట్రీలో కమెడియన్స్ హీరోలు అయిపోవడం.. యాంకర్స్ హీరోయిన్స్ అయిపోవడం.. ఇలా ఎన్నో మార్పులు చూస్తున్నాం.అయితే ఇంతమంది వివిధ రకాలుగా బిజీ అవుతున్నారు అంటే కారణం ఓటిటిలు. దేశంలో కరోనా మొదలైనప్పుడే ఓటిటిల వాడకం కూడా పెరిగింది. గతేడాది ముందు వరకు ఓటిటి అంటే.. థియేటర్లలో ఆడిన సినిమాలు ఓటిటిలో స్ట్రీమింగ్ అయ్యేవి. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. ప్రస్తుతం కొత్త సినిమాలు - వెబ్ సిరీసులు కూడా నేరుగా ఓటిటి రిలీజ్ అవుతున్నాయి. అలాగే ఓటిటిలకు అలవాటు పడిన ప్రేక్షకులు కూడా ఎలాగో థియేటర్స్ ఓపెన్ లేవు కదా సినిమాలు ఓటిటి రిలీజ్ చేయాలనీ ఇష్టపడుతున్నారు. అయితే ఈ క్రమంలో స్టార్ హీరోలు - హీరోయిన్స్ ఓటిటి మూవీస్ - వెబ్ సిరీస్ లలో నటించేందుకు సిద్ధం అవుతున్నారు.అయితే తెలుగు ప్రేక్షకులకు అందుబాటులో ఉన్నటువంటి ఓటిటి ఆహా. గతేడాది ప్రారంభమైన ఈ ఓటిటి ప్రస్తుతం మంచి ఫాలోయర్స్ తో విజయవంతంగా రన్ అవుతోంది. అయితే కమెడియన్ ప్రియదర్శి - నందిని రాయ్ కాంబినేషన్ లో ఓ సస్పెన్సు థ్రిల్లర్ వెబ్ సిరీస్ సిద్ధం అవుతోందట. సీనియర్ స్టార్ డైరెక్టర్ సురేష్ కృష్ణ నిర్మాతగా మారి ఈ వెబ్ సిరీస్ నిర్మించనున్నారు. న్యూ డైరెక్టర్ విద్యాసాగర్ దర్శకత్వం తెరకెక్కనున్న ఈ వెబ్ సిరీస్ కు ccఐ.ఎన్.జిcc అనే పేరు ఖరారు చేశారు. కానీ ఐ.ఎన్.జి అనే ఫుల్ ఫామ్ ఏంటి అనేది రివీల్ చేయలేదు. అయితే పూర్తి డీటెయిల్స్ మే 18న అంటే రేపు ప్రకటించనున్నట్లు తెలిపారు.

# సీనియర్ హీరోయిన్లతో దర్శకుల లాలూచీ దేనికి?



పేరున్న కథానాయికల్ని ఒప్పించి తమ సినిమాల్లో నటింపజేస్తే వెయిట్ పెరుగుతుందనేది దర్శక హీరోల ఆలోచన. ఆ కోవలో చూస్తే త్రివిక్రమ్.. సుకుమార్.. కొరటాల.. అనీల్ రావిపూడి వంటి టాప్ డైరెక్టర్లు ఈ ధోరణిని ఎక్కువ ఇష్టపడతారు. వరుసగా అగ్ర హీరోలతో పని చేసే ఈ దర్శకులు వెటరన్ హీరోయిన్లతో లాలూచీ నడిపించడం పలుమార్లు చర్చనీయాంశమైంది.తమ సినిమాల్లో వెటరన్ కథానాయికలకు చెప్పుకోదగ్గ అవకాశాల్నే కల్పిస్తున్నారు వీరంతా. కథలో వెయిట్ ఉండే పాత్రల్ని ఆఫర్ చేస్తూ వెటరన్స్ కి అవకాశం కల్పించడం మెచ్చదగిన ప్రయత్నం అనాలి.ఇక అగ్ర హీరో మహేష్ తో వరుసగా పలువురు సీనియర్ నాయికలు నటించిన సంగతి తెలిసిందే. నదియా- ఖుష్బూ- దేవయాని - టబు- విజయశాంతి ఇప్పటికే మహేష్ చిత్రాల్లో నటించారు. ఇప్పుడు శిల్పా శెట్టి మహేష్ తదుపరి సినిమాలో నటిస్తున్నారు. త్రివిక్రమ్ -హారిక బృందాలు శిల్పాజీని లాక్ చేయడం చర్చనీయాంశమైంది.ఇంతకుముందు నదియా - పవన్ కల్యాణ్ అత్తారింటికి దారేది చిత్రంలో నటించారు. ఖుష్బూ మెగాస్టార్ స్టాలిన్ లో నటించారు. టబు 2021సంక్రాంతి బ్లాక్ బస్టర్ అల వైకుంఠపురములో చిత్రంలో నటించారు. బన్ని ఇందులో హీరో. విజయశాంతి తదుపరి మెగాస్టార్ చిరంజీవి చిత్రంలో ఆఫర్ వస్తే నటించేందుకు సిద్ధమేనని అన్నారు. మెగా కాంపౌండ్ లేడీ సూపర్ స్టార్ విజయశాంతికి అవకాశాన్ని పరిశీలిస్తోందన్న టాక్ ఉంది.ఇక దేవయాని ప్రస్తుతం నాగచైతన్య - శేఖర్ కమ్ముల చిత్రం లవ్ స్టోరిలో నటిస్తున్నారు. ఈ మూవీ త్వరలో రిలీజ్ కి రావాల్సి ఉంది. స్నేహ ఇంతకుముందు పలువురు టాలీవుడ్ టాప్ స్టార్ల సినిమాల్లో నటించి మెప్పించారు. బన్ని-త్రివిక్రమ్ జోడీ సన్నాఫ్ సత్యమూర్తిలో స్నేహ రోల్ ఎంతగా వర్కవుటైందో తెలిసిందే. కథానాయికగానే కాకుండా క్యారెక్టర్ నటిగానూ స్నేహ గ్లామర్ యువతరాన్ని మెప్పించింది. ప్రభాస్ .. ఎన్టీఆర్ వంటి స్టార్లు అగ్ర దర్శకులతో చేసిన చాలా సినిమాల్లో సీనియర్ నాయికలతో ప్రత్యేక ఆకర్షణను జోడించారు. వెటరన్ నాయికల గ్లామర్ ఒక రకంగా ప్రధాన ఆకర్షణగా నిలుస్తుండగా.. వారి నుంచి ఔట్ పుట్ కూడా అంతే ఈజీగా రాబట్టుకునేందుకు దర్శకులకు ఆస్కారం ఉంటుంది. అందుకే వారితో లాలూచీ పెట్టుకుంటారన్నమాట.


# పక్కా కమర్షియల్ డైరెక్టర్ ఇప్పుడు ఏమి చేస్తున్నాడంటే..!



వినోదాత్మక చిత్రాల దర్శకుడు మారుతి ccఈ రోజుల్లోcc ccబస్ స్టాప్cc వంటి యూత్ ఫుల్ సినిమాలతో మెప్పించాడు. ఆ తర్వాత ccప్రేమ కథా చిత్రమ్cc ccభలే భలే మగాడివోయ్cc ccమహానుభావుడుcc వంటి సినిమాలతో ఫ్యామిలీ ఆడియెన్స్ కి దగ్గరయ్యారు. ఇక ccప్రతిరోజూ పండగేcc సినిమాతో సాలిడ్ హిట్ అందుకున్న మారుతి.. చాలా రోజుల గ్యాప్ తర్వాత యాక్షన్ హీరో గోపీచంద్ తో ccపక్కా కమర్షియల్cc అనే కమర్షియల్ ఎంటర్టైనర్ తో వస్తున్నారు. లాక్ డౌన్ కారణంగా షూటింగ్ కి బ్రేక్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన మారుతి పలు ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు.ప్రస్తుతం ఈ సెకెండ్ వేవ్ లాక్ డౌన్ లో కొత్త స్క్రిప్ట్ లు రాసుకుంటున్నట్లు దర్శకుడు మారుతి తెలిపారు. వెబ్ సిరీస్ ల కోసం ఏమైనా స్క్రిప్ట్ లు రాస్తున్నారా? అని ప్రశ్నించగా.. 'త్రీ రోజెస్‌వ అనే వెబ్ సిరీస్ కోసం మూలకథని అందించానని.. ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటోందని చెప్పారు. ఇప్పుడు తాను రాస్తున్న కథలన్నీ సినిమాల కోసమేనని.. పూర్తిగా కథపైనే దృష్టిపెట్టే ఇలాంటి సమయం మళ్లీ దొరకదని మారుతి చెప్పుకొచ్చారు. అలానే భవిష్యత్తులో నాణ్యమైన సినిమాలు తీయకపోతే కష్టమేనని.. మంచి కాన్సెప్ట్ లతో సినిమాలు వస్తున్నాయని మారుతి అన్నారు.ccరీసెంటుగా చూసిన సినిమాలలో 'సినిమా బండివ బాగా తీశారనిపించింది. అలా మంచి స్క్రిప్టులతో మరింత బాధ్యతతో సినిమాలు చేయాలి. ప్రస్తుతం నా దృష్టంతా దానిపైనే ఉందిcc అని మారుతి చెప్పుకొచ్చారు. ఇకపోతే డైరెక్టర్ మారుతి ఇటీవల కరోనాతో మరణించిన సినీ జర్నలిస్ట్ నటుడు టీఎన్నార్ కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. యాభై వేల రూపాయలను తక్షణ సాయంగా టీఎన్నార్ భార్య అకౌంట్ కు ట్రాన్స్ఫర్ చేసి తన మంచి మనసును చాటుకున్నారు.

# ట్యాగ్ కోసం డబ్బులిచ్చి మరీ ప్రమోషన్ చేయించుకుందా..?

టాలీవుడ్ గడపతొక్కిన శాండిల్ వుడ్ బ్యూటీ ఒకరు అనతికాలంలోనే అశేష అభిమానునలను సంపాదించుకుంది. వరుస అవకాశాలతో పాటుగా హిట్స్ అందుకుంటూ స్టార్ హీరోలకు బెటర్ ఛాయిస్ గా మారింది. ఈ క్రమంలో ఇప్పుడు ఇతర ఇండస్ట్రీలలో కూడా పాగా వేయాలని ప్లాన్ చేసుకుంది. అటు క్లాస్ ఇటు మాస్ ఆడియన్స్ ని టార్గెట్ చేస్తూ సినిమాలు ఎంపిక చేసుకుంటున్న ఈ భామ.. ఇటీవల ఓ అరుదైన ఘనత సాధించి అందరినీ షాక్ కి గురి చేసింది.టాలీవుడ్ క్రేజీ హీరోయిన్ గా మారిన ఈ బ్యూటీ గురించే ఎక్కువగా నెటిజన్స్ సెర్చ్ చేసినట్లుగా ప్రకటిస్తూ గూగుల్ ఓ కొత్త



ట్యాగ్ ఇచ్చింది. దీంతో ఒక్కసారిగా అమ్మడి పేరు సోషల్ మీడియాలో మారుమోగిపోయింది. ఈ సందర్భంగా ట్విట్టర్ వేదికగా సంతోషాన్ని వ్యక్తం చేస్తూ తన అభిమానులు ప్రేక్షకులపై ప్రేమ కురిపించింది ఈ బ్యూటీ. అయితే ఆమెకు ఈ గుర్తింపు దక్కడం పట్ల నెగిటివ్ కామెంట్స్ చేసిన వాళ్ళు కూడా లేకపోలేదు.డబ్బులిచ్చి మరీ ఈ విధంగా సోషల్ మీడియాలో ప్రమోషన్స్ చేయించుకుందని కొందరు విమర్శలు చేశారు. దీని కోసం అమ్మడు దాదాపుగా 25 లక్షలు ఖర్చు చేసిందని సినీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.




EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190